ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
అనకాపల్లి
జిల్లా వార్తలు
గురువారం 25 సెప్టెంబరు 2025



విభిన్న అలంకరణల్లో అమ్మవార్లు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మూడో రోజైన బుధవారం పలు ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. సతకంపట్టులో కనకదుర్గమ్మ అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నూకాంబిక అమ్మవారి ఆలయంలో నిర్వహించిన లక్ష్మీగణపతి హోమంలో కలెక్టర్ విజయకృష్ణన్, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్. సుజాత పాల్గొని పూజలు చేశారు. కన్యకాపరమేశ్వరి, కామాక్షిదేవి ఆలయాల్లో అమ్మవార్లు ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



గాయత్రిదేవి అలంకరణలో సతకంపట్టు కనకదుర్గమ్మ

ఎలమంచిలి ఎంపీపీపై అవిశ్వాసం

ఇన్‌చార్జి ఎంపీడీవోకు నోటీసు అందజేసిన నలుగురు సభ్యులు

- మండలంలో మొత్తం ఏడు ఎంపీటీసీ స్థానాలు
- ఒకరి మృతితో ప్రస్తుతం ఆరుగురు సభ్యులు
- ఎంపీపీకి వ్యతిరేకంగా నలుగురు సభ్యులు నోటీసుపై సంతకాలు



ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావుకు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేస్తున్న వైస్ ఎంపీపీలు రాజాన శేషు, ఎస్.ఉమ, ఎంపీటీసీ సభ్యులు నగిరెడ్డి అమ్మాజీ, బర్రే శివలక్ష్మి

ఎలమంచిలి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):

ఎలమంచిలి మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) అధ్యక్షునిపై అవిశ్వాసం ప్రకటిస్తూ పలువురు ఎంపీటీసీ సభ్యులు బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రాజాన శేషు మీడియాతో మాట్లాడుతూ, తనతోపాటు మరో వైస్‌ఎంపీపీ శిల పరశెట్టి ఉమ (జంపపాలెం), ఎంపీటీసీ సభ్యులు నగిరెడ్డి అమ్మాజీ (ఏటికొప్పాక-1), బర్రే శివలక్ష్మి (కొత్తలి) అవిశ్వాస నోటీసుపై సంతకాలు చేసి తొలుత అనకాపల్లి ఆర్డీఓకు, అనంతరం ఎలమంచిలి ఇన్‌చార్జి ఎంపీడీఓకు అందజేసినట్టు చెప్పారు.

ఎలమంచిలి మండలంలో మొత్తం ఏడు ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు. ఏటికొప్పాక-1 నుంచి నగిరెడ్డి అమ్మాజీ, ఏటికొప్పాక-2 నుంచి నగిరెడ్డి దేముడమ్మ (ఇటీవల మృతిచెందారు), బయ్యవరం నుంచి పూటకూటి రామగణేశ్, పులపర్తి నుంచి బోదెపు గోవిందరావు, కొత్తలి నుంచి బర్రె శివలక్ష్మి, రేగుపాలెం నుంచి రాజాన శేషు, జంపపాలెం నుంచి శిలపరశెట్టి ఉమ ఎన్నికయ్యారు. తరువాత ఎంపీపీగా బోదెపు గోవిందరావు, వైస్ ఎంపీపీలుగా రాజాన శేషు, శిల పరశెట్టి ఉమలను ఎన్నుకున్నారు. కాగా వైస్ ఎంపీపీ రాజాన శేషు అప్పట్లోనే ఎంపీపీ పదవిని ... మిగతా 10వ పేజీలో

ప్రయాణం దూరాభారం

విజయరామరాజుపేట వద్ద కాజ్‌వే కొట్టుకుపోవడంతో ప్రజలకు రవాణా కష్టాలు

- చోడవరం-పాడేరు బస్సులు చీడికాడ మండలం మీదుగా మళ్లింపు
- 22 కిలోమీటర్లు పెరిగిన ప్రయాణ దూరం



పాడేరు వెళ్లే బస్సు నిండిపోవడంతో ప్లాట్‌ఫారంపై వేచి వున్న ప్రయాణికులు

చోడవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):

వర్షాలతో రహదారులు ఛిద్రం కావడం, విజయరామరాజుపేట వద్ద కాజ్‌వే కొట్టుకుపోవడంతో చోడవరం-పాడేరు మధ్య ప్రయాణ సమయం రెట్టింపు అయ్యింది. గతంలో చోడవరం నుంచి ఆర్టీసీ బస్సులో రెండు లేదా రెండున్నర గంటల్లో పాడేరు చేరుకునేవారు. ఐదేళ్లుగా రహదారులు దెబ్బతినడడంతో ప్రయాణ సమయం మరో అరగంట పెరిగింది. ఈ నేపథ్యంలో బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిపై వున్న కాజ్‌వే వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో ఆర్టీసీ బస్సులను చోడవరం నుంచి చీడికాడ, అప్పలరాజుపురం, కె.జె.పురం జంక్షన్ మీదుగా మళ్లించారు. కాజ్‌వే బాగున్నప్పుడు చోడవరం నుంచి విజయరామరాజుపేట, వడ్డాది మీదుగా పాడేరుకు బస్సులు నడిచేవి. ఇప్పుడు చుట్టూ తిరిగి వెళ్లాల్సి



పునరుద్ధరణకు నోచుకోని విజయరామరాజుపేట కాజ్‌వే

- ఇరుకు రహదారి కావడంతో స్తంభిస్తున్న ట్రాఫిక్
- పాడేరు వెళ్లడానికి ఐదు గంటలకుపైగా సమయం
- గతంలో రెండున్నర గంటల్లో గమ్యానికి చేరిక
- కాజ్‌వేలను వెంటనే పునరుద్ధరించాలని ప్రజల వినతి

రావడంతో 22 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తున్నది. చోడవరం నుంచి 55 కిలోమీటర్ల దూరంలో వున్న పాడేరు వెళ్లేందుకు ఇటీవల వరకు మూడు గంటల సమయం పట్టేది. ఇప్పుడు మరో 22 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి రావడంతోపాటు ఇరుకు రహదారి కావడంతో ఐదు గంటలు పడుతున్నది. చీడికాడ మండలంలోని రోడ్డు బాగానే ఉన్నప్పటికీ, అది సింగిల్ లేన్ రోడ్డు కావడంతో భారీ వాహనాలు ఎదురైతే తప్పుకోవడం కష్టంగా వుంది. ఈ కారణంగా తరచూ ట్రాఫిక్ స్తంభిస్తున్నది. దీంతో ప్రయాణ సమయం మరింత పెరుగుతున్నది. గతంలో విశాఖ నుంచి చోడవరం మీదుగా పాడేరుకు ఆర్టీసీ బస్సు మూడున్నర గంటల్లో వెళ్లేది. ఇప్పుడు ఆరు లేదా ఏడు గంటలు పడుతున్నదని ప్రయాణికులు వాపోతున్నారు.

మూడు మండలాల ప్రజల ఇక్కట్లు

విజయరామరాజుపేట వద్ద సుమారు ఐదు వారాల క్రితం కొట్టుకుపోయిన కాజ్‌వేను ఇంతవరకు పునరుద్ధరించకపోవడంతో పాడేరు ప్రాంతంతోపాటు మాడుగుల, చీడికాడ, రావికమతం మండలాల ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మాడుగుల మీదుగా నడిచే బస్సుల్లో మాడుగుల ... మిగతా 10వ పేజీలో

పోలవరం కాలువ పనులను వేగవంతం చేయాలి

- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

పాయకరావుపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):



పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ కాలువ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం పాయకరావుపేట వద్ద జరుగుతున్న పోలవరం ఎడమ కాలువ పనులను పరిశీలించారు. తాండవ షుగర్ ఫ్యాక్టరీ వెనుక కొండ ప్రాంతంలో జరుగుతున్న బ్లాస్టింగ్, కాలువ నిర్మాణ పనులను పరిశీలించిన ఆమె.. వేగవంతం చేయాలని ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. అంతకుముందు తిరుమల స్కూల్‌లో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి డీఎస్సీలో ఎంపికై, అమరావతి వెళుతున్న ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులకు కల్పించిన భోజన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఆమె వెంట తహశీల్దారు ఎస్ఏ మహేశ్వరరావు, పోలవరం ప్రాజెక్టు ఈఈ రామకోటేశ్వరరావు, డీఈఈ గోపాలకృష్ణ, ప్రాజెక్టు మేనేజర్ వెంకటకిశోర్ తదితరులు వున్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు

పరవాడ- లంకెలపాలెం రహదారిలో భారీ గోతులు

- రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- వర్షాలతో సమస్య పరిస్థితి మరింత దారుణం



తిరుపతి ఫ్యూయల్స్ సమీపంలో ఆనవాళ్లు లేని తారురోడ్డు

పరవాడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):

స్థానిక మండల పరిషత్ జంక్షన్ నుంచి ఫార్మాసిటీ మీదుగా లంకెలపాలెం వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై పలుచోట్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వీటి కారణంగా



రానార్ ఆగ్రో పరిశ్రమ సమీపంలో పొడవుగా గొయ్యి ఏర్పడి రెండుగా చీలిపోయినట్టు కనిపిస్తున్న రహదారి

వాహనాలు పాడైపోవడంతోపాటు తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఏడాదిగా ప్రజలు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ పట్టించుకునే వారే లేకపోయారు. ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే ఫార్మాసిటీ కార్మికులతోపాటు లంకెలపాలెం, సబ్బవరం, అగనంపూడి తదితర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మండల పరిషత్ జంక్షన్ నుంచి సింహాద్రి జంక్షన్ వరకు రహదారి పూర్తిగా గోతులమయమైంది. తిరుపతి ఫ్యూయల్స్ పరిశ్రమ సమీపంలో రహదారిపై రెండుచోట్ల ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. రానార్ ఆగ్రో పరిశ్రమకు సమీపంలో రోడ్డు మొత్తం భారీ గొయ్యి ఏర్పడింది. కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రహదారి మరింత అధ్వానంగా మారింది. అధికారులు తక్షణమే స్పందించి రహదారిపై గుంతలను కప్పాలని స్థానికులు కోరుతున్నారు.



వర్షం నీరు నిలిచి చెరువును తలపిస్తున్న గొయ్యి

ఇంజనీరింగ్ సీట్లు.. విద్యార్థుల పాట్లు

తొలి రెండు విడతల కౌన్సెలింగ్‌లో సీట్లు రాని పలువురికి మూడో విడతలో కేటాయింపు

- మరోవిడత కౌన్సెలింగ్ ఉంటుందని తెలియక మేనేజ్‌మెంట్ కోటాలో చేరేందుకు సిద్ధమైన కొందరు విద్యార్థులు
- కాలేజీల యాజమాన్యాలకు అడ్వాన్స్‌ల చెల్లింపు
- ఒరిజినల్ సర్టిఫికెట్లు కూడా అందజేత
- ...ఇప్పుడు అవి వెనక్కి ఇచ్చేందుకు ససేమిరా
- అధికారులకు విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"ఎంపీపీ కాలనీకి చెందిన శ్వేత ఈసీఈలో చేరాలని భావించింది. ఈ మేరకు కౌన్సెలింగ్‌లో ప్రముఖ కాలేజీలను ఎంపిక చేసుకుంది. రెండు విడతలు కౌన్సెలింగ్ పూర్తయ్యే సమయానికి సీటు రాకపోవడంతో ముందుజాగ్రత్త చర్యగా ఎంపిక చేసుకున్న ఒక కాలేజీలో మేనేజ్‌మెంట్ కోటాలో చేరేందుకు సిద్ధమైంది. ఇందుకోసం ఏడాదికి రూ.1.8 లక్షలు చొప్పున ఫీజు చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. సీటు కన్ఫార్మ్ చేసుకునేందుకు తొలి విడత రూ.40 వేలు చెల్లించింది. ఒరిజినల్ సర్టిఫికెట్లను యాజమాన్యానికి ఇచ్చింది. అయితే ఇటీవల నిర్వహించిన మూడో విడత కౌన్సెలింగ్‌లో శ్వేతకు ప్రముఖ కాలేజీలో ఈసీఈ సీటు వచ్చింది. మేనేజ్‌మెంట్ కోటాలో సీటు ఇచ్చేందుకు సర్టిఫికెట్లు తీసుకున్న కాలేజీ యాజమాన్యం...ఒక పట్టాన వాటిని తిరిగి ఇవ్వలేదు. దీంతో శ్వేత ఏడాది ఫీజు (రూ.1.8 లక్షలు)ను చెల్లించి తన సర్టిఫికెట్లను తీసుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఎంతోమంది విద్యార్థులు ఇదే ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు."



ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల భర్తీకి రెండు విడతల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సీట్లు రాని ఎంతోమంది విద్యార్థులు మేనేజ్‌మెంట్ కోటాలో చేరేందుకు కాలేజీల యాజమాన్యాలతో మాట్లాడు కున్నారు. అడ్వాన్స్‌గా కొంత మొత్తం చెల్లించడంతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇచ్చేశారు. అయితే, రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీల్లో పెద్ద సంఖ్యలో సీట్లు మిగిలిపోవడంతో ఉన్నత విద్యా మండలి మూడో విడత కౌన్సెలింగ్‌ను నిర్వ హించింది. మొదటి రెండు విడతల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సీట్లు రాని ఎంతోమంది విద్యార్థులు మూడో విడత కౌన్సెలింగ్‌లో తాము కోరుకున్న ... మిగతా 10వ పేజీలో

అమరావతికి నూతన ఉపాధ్యాయులు

- ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో భోజన ఏర్పాట్లు చేసిన అధికారులు

నక్కపల్లి/ ఎస్.రాయవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):

ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులు గురువారం అమరావతిలో ప్రభుత్వం నిర్వహించే అభినందన సభలో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా నుంచి నూతన ఉపాధ్యాయులతోపాటు వారి కుటుంబ సభ్యులు బుధవారం విశాఖ నుంచి బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. సుమారు మూడు వేల మంది కోసం 80 బస్సులను అధికారులు సమకూర్చారు. ఉదయం విశాఖలో బయలుదేరిన వీరు



ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు తిమ్మాపురం చేరుకున్న నూతన ఉపాధ్యాయులు



నక్కపల్లిలో భోజనాలు చేస్తున్న నూతన ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు

మధ్యాహ్నానికి ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాలకు చేరుకున్నారు. ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు తిమ్మాపురంలోని ఆదర్శ స్కూల్లో 450 మంది డీఎస్సీ నూతన ఉపాధ్యాయులతోపాటు వారి కుటుంబ సభ్యులు 450 కలిపి మొత్తం 900 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. అదే విధంగా నక్కపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సుమారు రెండు వేల మందికి భోజన ఏర్పాట్లు చేశారు. విద్యా శాఖ ఆర్జేడీ బి.విజయభాస్కర్, అనకాపల్లి డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు, విశాఖపట్నం డీఈవో ప్రేమకుమార్ ఆయా విద్యా సంస్థల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఆహార పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

హైవేలో బ్లాక్ స్పాట్‌ల పరిశీలన

- ప్రమాదాల నివారణకు అధికారుల చర్యలు



జాతీయ రహదారిలో బ్లాక్ స్పాట్‌లను పరిశీలిస్తున్న సీఐ, ఎంవీఐ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి పట్టణం, మండల పరిధిలోని వివిధ రహదారుల్లో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్‌లు) ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ బుధవారం ఎంవీఐతో కలిసి పరిశీలించారు. ప్రమాదాలకుగల కారణాలను తెలుసుకొని వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి విశ్లేషించారు. జాతీయ రహదారిలో ఉమ్మలాడ జంక్షన్, కొత్తూరు జంక్షన్, నూకాలమ్మ ఆలయ ముఖద్వారం జంక్షన్‌లను పరిశీలించారు. కాగా ఎన్టీఆర్ వైద్యాలయం చుట్టుపక్కల ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగజేయవద్దని, కూరగాయల మార్కెట్ వద్ద గల డీసీఎంఎస్ ఖాళీ స్థలంలో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని ఆటోలు, ప్రైవేటు అంబులెన్స్‌ల డ్రైవర్లకు స్పష్టం చేశారు.

ఇద్దరు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు జనసేనలో చేరిక



జనసేనలో చేరిన వారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వైసీపీకి చెందిన ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు జనసేన పార్టీలో చేరారు. దిబ్బపాలెం-1 ఎంపీటీసీ సభ్యుడు అడిగర్ల శ్రీనివాసరావు, చోడపల్లి ఎంపీటీసీ సభ్యుడు లాలం శ్రీనివాసరావుతో పాటు సెజ్ పునరావాస కాలనీ వైసీపీ నాయకుడు గోవాడ కిరణ్ కుమార్‌లు మంగళగిరిలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సమక్షంలో బుధవారం జనసేన గూటికి చేరారు. వీరికి విజయకుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై జనసేనలో చేరామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు, ద్వారపురెడ్డి బాపూజీ, బుజ్జిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి కోర్టు ఏజీపీగా గోవిందరావు



ఎలమంచిలి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం ఎలమంచిలి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంటు ప్లీడర్‌గా స్థానిక న్యాయవాది రాజాన గోవిందరావు నియామకమయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు అందినట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వం తరఫున సివిల్ కేసులకు న్యాయవాదిగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా అతనిని తోటి న్యాయవాదులు అభినందించారు.

'కూటమి నియమాలకు అనుగుణంగా నడుచుకోండి'



టీడీపీ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పెంటకోట విజయ్

మునగపాక, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ శ్రేణులంతా కూటమి నియమాలకు అనుగుణంగా నడుచుకోవాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ పిలుపు నిచ్చారు. బుధవారం ఇక్కడ జరిగిన తిమ్మరాజుపేట, వాడ్రాపల్లి, గొల్లలపాలెం గ్రామాల కేడర్ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలపై వైసీపీ చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ఈ సమావేశంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీను, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, శంకర్, మళ్ల వరహానర్సింగరావు, మొల్లి అప్పలరాజు, సూరిశెట్టి రాము, బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

పశు పోషణలో జాగ్రత్తలు పాటించాలి

మునగపాక, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులు పశు పోషణలో జాగ్రత్తలు పాటించాలని పశు వైద్యాధికారి గణేశ్ సూచించారు. మండలంలో పల్లపు ఆనందపురంలో బుధవారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు పలు రకాల పరీక్షలు జరిపిన అనంతరం పాడి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి అప్పియ్యమ్మ, ఎంపీటీసీ కర్రి సంజీవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రపురంలో తాగునీటి సమస్య

» ఏడాదిగా ఇబ్బందులు పడుతున్న ఎస్సీ కాలనీవాసులు » ఫిర్యాదు చేసినా కార్యదర్శి పట్టించుకోవడం లేదని అంతా ఆవేదన



రామచంద్రపురంలోని ఎస్సీ కాలనీ

రాంబిల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లాలంకోడూరు పంచాయతీ శివారు రామచంద్రపురం ఎస్సీ కాలనీని తాగునీటి సమస్య వేధిస్తోంది. ఏడాది కాలంగా నివాసితులు అవస్థలు పడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. సుమారు వెయ్యి మంది వరకు జనాభా నివాసం ఉన్న ఈ కాలనీలో రెండు చేతిబోర్లు ఉన్నప్పటికీ ఉప్పునీరు వస్తుండడంతో తాగేందుకు పనికిరావు. ప్రస్తుతం ఆ బోర్లు కూడా మూలకు చేరినట్టు గ్రామస్థులు చెపుతున్నారు. లాలంకోడూరులో గల రక్షిత మంచినీటి పథకం నుంచి రామచంద్రపురం ఎస్సీ కాలనీకి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా అయ్యేది. అది కూడా వారానికి ఒకసారి మాత్రమే వచ్చేది. చాలీచాలని నీటితో సర్దుకు పోయేవారమని, కానీ కొన్ని నెలలుగా ఆ నీరు కూడా రాకపోవడంతో మరిన్ని ఇబ్బందులు తప్పడం లేదని వారంతా వాపోతున్నారు. ఇళ్లలో బోర్లు ఉన్నవారి వద్దకు వెళ్లి బతిమిలాడుకొని వాడుకకు నీటిని తెచ్చుకుంటున్నామని తెలిపారు. పండుగలు, శుభకార్యాలు జరిగినప్పుడు తాగునీటికి తమ కష్టాలు వర్ణనాతీతంగా ఉంటాయని అంటున్నారు. తమ పంచాయతీకి సర్పంచ్ లేకపోవడంతో తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు కార్యదర్శికి విన్నవించినా చెవిన వేసుకోవడం లేదని వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కార్యదర్శి దృష్టి సారించకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వార్డు సభ్యులు ఎం.పద్మ, రమణారావులతో పాటు కాలనీ వాసులు తెలిపారు.



కాలనీకి తాగునీరు సరఫరా చేసే లాలంకోడూరులోని నీటి పథకం ట్యాంక్



నీరు రాక ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తున్న కుళాయి

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మునగపాక, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అం తరాయం ఏర్పడనుందని ఏఈ జగదీష్ తెలిపారు. ఈ కారణంగా ఉద యం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మునగపాక, తిమ్మరాజుపేట, కొత్త నాగవరం, పాత నాగవరం, వాడ్రాపల్లి, గొల్లలపాలెం, కుంచవానిపాలెం గ్రామాలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

వరి పొలాల్లో పొటాష్ లోపం

» నివారణకు జిల్లా వనరుల కేంద్రం ఏవో విజేత సూచనలు

రాంబిల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మామిడివాడ గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోందని కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సదర్భంగా జిల్లా వనరుల కేంద్రం ఏవో పి.విజేత వరి పొలాలను పరిశీలించారు. ప్రస్తుతం వరిపొలాల్లో ఎక్కువగా పొటాష్ లోపం గమనించినట్టు చెప్పారు. ఆకులు చివరి భాగం నుంచి పసుపు రంగులోకి మారి ఉన్నట్టయితే అది పొటాష్ లోపంగా గుర్తించాలన్నారు. ఈ లోపం నివారణకు మ్యురేజ్ ఆఫ్ పొటాష్ ఎకరానికి 20 కేజీలు చొప్పున చల్లాలని సూచించారు. పలు చోట్ల వరికి ఆకు ముడత ప్రభావం ఎక్కువగా ఉన్నట్టు వివరించి నివారణకు సూచనలు చేశారు. ప్రారంభ దశలో వేపనూనే లేదా నీమాస్త్రం, పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నపు క్లోరీపైరీపాస్ లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. సుడిదోమ ఆశిస్తే ఎసిఫేట్ 1.6 గ్రాములు లీటరు నీటిలో కలిపి చల్లాలన్నారు. వరిలో వ్యవసాయాధికారుల సూచనల మేరకు నత్రజని ఎరువులు వినియోగించుకోవాలని ఆమె రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత మాట్లాడుతూ ఎరువులను అధికంగా వాడడం వలన సుడిదోమ పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్య క్రమంలో ఏఈవో ఎన్.శ్రీనివాస్, ఎంపీఈవో ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో చురుగ్గా అప్రోచ్ రోడ్డు పనులు

మునగపాక, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మునగపాక పెద్దమదుం ఆనుకొని నూతనంగా నిర్మించిన బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు పనులు జోరందుకున్నాయి. అనకాపల్లి- అచ్యుతాపురం పూడిమడక రోడ్డు విస్తరణ పనుల్లో బ్రిడ్జి నిర్మాణం ఒకటి. ఈ కొత్త బ్రిడ్జిని ఆనుకొని ఉన్న పెద్దమదుం పాతది కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీనిపైనే నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించేవి. మదుం బలహీనంగా ఉండడంతో ఏ సమయంలోనైనా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని పలువురు భయాందోళన చెందేవారు. ఈ సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మదుంను ఆనుకొని కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేశారు. అయితే బ్రిడ్జి వినియోగంలోకి రావాలంటే అప్రోచ్ రోడ్డు అవసరం ఉంది. ఈ రోడ్డు వేయాల్సిన స్థలంలో వీరాంజనేయ మూల సంఘానికి చెందిన ఆంజనేయస్వామి, నందీశ్వరుడు విగ్రహాలతో పాటు నాలుగు షాపులు ఉండేవి. సంఘ సభ్యులతో మాట్లాడి వారికి పరిహారం చెల్లించి వాటిని తొలగించారు. ఇప్పుడు ఆ ప్రదేశంలో అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.



ఇటీవల నిర్మించిన బ్రిడ్జిద్ద శరవేగంగా జరుగుతున్న అప్రోచ్ రోడ్డు పనులు

అన్నపూర్ణాదేవిగా కన్యకాపరమేశ్వరీ అమ్మవారు



ఎలమంచిలిలో కొలువుదీరిన అమ్మవారు

ఎలమంచిలి/మునగపాక, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ ప్రాంతంలో అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఎలమంచిలిలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వాసవీ మహిళలకు 'మంటలేని వంట' అనే వంటల తయారీ పోటీ నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి, చార్టెడ్ అకౌంటెంట్ టీఎస్.బంగారు శెట్టి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విశ్రాంత ఉపాధ్యాయినులు అరుణ, కామేశ్వరి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఇదిలావుంటే, గాంధీనగర్ రైల్వేస్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన పద్నాలు అడుగుల దుర్గా మాత విగ్రహం విశేషంగా ఆకట్టుకుంటోంది. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారు. అలాగే, మునగపాక మండలంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన అమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శినమిచ్చారు.



'మంటలేని వంట' పోటీలో పాల్గొన్న మహిళలు

ఆది వినాయక విగ్రహం నిమజ్జనం



విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకు వెళుతున్న భక్తులు

మునగపాక, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మునగపాకలోని విఘ్నేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నెలరోజుల పాటు నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ప్రతి రోజూ విశేష పూజలు నిర్వహించేవారు. సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటయ్యేవి. ముగింపు సందర్భంగా స్వామివారి విగ్రహాన్ని మేళతాళాలు, బాజా భజంత్రీల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ మందపాటి రాము, దాడి శ్రీరామ్మూర్తి, దొడ్డి గంగసూరి, ఆడారి పరశురాం, బొడ్డేడ రామునాయుడు, ములబంద గోడి సభ్య రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ వితరణ



ఆనంద్‌కు ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ అందజేస్తున్న హోం మంత్రి అనిత

పాయకరావుపేట రూరల్: మండలంలోని సత్యవరానికి చెందిన దివ్యాంగుడు సుంకర ఆనంద్‌కు హోంమంత్రి వంగలపూడి అనిత బుధవారం నక్కపల్లి క్యాంపు కార్యాలయం వద్ద ఎలక్ట్రికల్ ట్రైసైకిల్ అందజేశారు. చిన్నతనం నుంచి సుంకర ఆనంద్ దివ్యాంగుడు. కూరగాయలు అమ్ముకుంటూ, సైకిల్‌లు రిపేరు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సుపరిపాలనలో కార్యక్రమంలో భాగంగా మంత్రి అనిత నిర్వహించిన సత్యవరం పర్యటనలో సైకిల్ రిపేర్ చేస్తున్న సుంకర ఆనంద్ పరిస్థితిని చూసి తన సొంత నిధులతో కొనుగోలు చేసిన ఎలక్ట్రికల్ ట్రైసైకిల్‌తోపాటు కొంత నగదును బుధవారం ఆనంద్‌కు అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, కొప్పిశెట్టి వెంకటేశ్, అబద్ధం, కీర్తి సీతారాం, వడ్డాది వాసు పాల్గొన్నారు.

సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడులు



నామవరంలో పొలం పిలుస్తోందిలో వ్యవసాయ అధికారులు

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరిలో సస్య రక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి. ఆదినారాయణ అన్నారు. మండలంలోని నామవరం, పాయకరావుపేటలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను వ్యవసాయాధికారులు సూచించిన మేరకే చల్లుకోవాలన్నారు. అధికంగా ఎరువుల తో లాభాల కంటే నష్టాలు సంభవిస్తాయన్నారు. నానో యూరియా, నానో, డీఏపీ ఎ రువులపై రైతులకు వివరించారు. వరి పంట కాలంలో నత్రజని 32 కేజీలు, భాస్వరం 24 కేజీలు, పొటాష్ 20 కేజీలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నాగమణి, వీఏఏ శ్రవణ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ నికర లాభం రూ.8.51 కోట్లు

» ప్రకటించిన చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గత ఆర్థిక సంవత్సరంలో విశాఖ డెయిరీ రూ.1,755 కోట్ల టర్నోవర్‌తో రూ.8.51 కోట్ల నికర లాభం ఆర్జించిందని డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ప్రకటించారు. షీలానగర్‌లో బుధవారం జరిగిన డెయిరీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో 19.28 కోట్ల లీటర్ల పాలు, 5.84 కోట్ల కిలోల పెరుగు విక్రయించామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించి రూ.20 కోట్ల నికరలాభం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జీఎస్టీ తగ్గింపుతో సుమారు వందకు పైగా ఉత్పత్తుల పై ధరలు తగ్గించామన్నారు. ఈ సమావేశంలో పలువురు డైరెక్టర్‌లు, అధికారులు రైతులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో స్టీల్‌ప్లాంట్ రాష్ట్రానికే తలమానికం

» జంషెడ్‌పూర్‌లా అభివృద్ధి » హోం మంత్రి అనిత

నక్కపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలో ఏర్పాటు కానున్న ఆర్సెలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ రాష్ట్రానికే తలమానికంగా నిలిచి, భవిష్యత్తులో నక్కపల్లి మండలం జంషెడ్‌పూర్‌లా అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. బుధవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో కూటమి నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాయకరావుపేట నియోజకవర్గం పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా స్టీల్‌ప్లాంట్ నిర్మితమవుతుందన్నారు. తనను మీ ఇంటి ఆడపడుచులా ప్రజలంతా ఆశీర్వదించి గెలిపించారని, అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ తరువాత నియోజకవర్గం రూపురేఖలు పూర్తిగా మారుతాయని, ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాయని, ఉపాధి, ఉద్యోగవకాశాలు పెరుగుతాయని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గం టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, పీఏసీఎస్ చైర్ పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కురందాసు నూకరాజు మాట్లాడుతూ ఏడాది కాలంలో రూ.కోట్ల అభివృద్ధి పనులు నియోజకవర్గంలో చేపట్టిన ఘ నత హోం మంత్రి అనితకే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో వీవీ రమణ, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, వెలగా శ్రీను, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ, నానేపల్లి రాఘవులు, మజ్జూరి నారాయణరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

50 గోకులం షెడ్లు మంజూరు



మండలస్థాయి అధికారుల సమావేశం

కోటవురట్ల, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): మండలానికి రెండో విడతగా 50 మినీ గోకులాల షెడ్లు మంజూరైనట్టు స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో వివిధశాల మండలస్థాయి కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు తొలివిడత 50 పశువులను కొనుగోలు చేసి ఇవ్వాలని నిర్ణయించగా, ఇప్పటికే 35పశువులను పాడిరైతులకు అప్పగించినట్టు ఆయన తెలిపా రు. మిగతా 15పశువులను త్వరలో అందజేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు,ఏవో సరోజని తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన



స్థానిక మండల పరిషత్ కాశిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో

నక్కపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌లు పంచాయతీరాజ్ చట్టంపై పూర్తి అవగాహన కల్పించుకోవాలని ఎంపీడీవో డీ సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పాయకరావుపేట, నక్కపల్లి మండలాలకు చెందిన ఎంపీపీలు, సర్పంచ్‌లు, సెక్రటరీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం, ప్రణాళికల రూపకల్పన పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, పాల్గొన్నారు.

డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు ఆతిథ్యం

పాయకరావుపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ- 2025లో ఎంపికై గురువారం అమరావతిలో నియామకపత్రాలందుకునేందుకు వెళుతున్న ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులకు బుధవారం పాయకరావుపేటలో కొద్దిసేపు బుధవారం ఆతిథ్యం ఇచ్చారు. మధ్యాహ్నం విజయనగరం జిల్లా నుంచి వివిధ బస్సుల్లో పాయకరావుపేట వచ్చిన 1,500 మందికి పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూలు, శ్రీకాకుళం, మన్యం జిల్లాలకు చెందిన 1,200 మందితోపాటు వారితో వచ్చి తల్లిదండ్రులకు స్థానిక తిరుమల స్కూల్‌లో ఆతిథ్యం కల్పించారు. వీరందరికి పట్టణంలో ఓ హోటల్‌లో భోజనాలు ఏర్పాటు చేశారు. వారు కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత సాయంత్రం 4కు బస్సుల్లో తిరిగి అమరావతికి బయలుదేరి వెళ్లారు. వీరి కోసం 70 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను మూడు జిల్లాల డీఈఓల ఆధ్వర్యంలో పాయకరావుపేట ఎంఈఓ-1 కేఎస్ గాంధీ, ఎంఈఓ-2 బి.రమేశ్‌బాబు, పీడీలు టి.రవి, ఎస్.రవి తదితరులు పర్యవేక్షించారు. కలెక్టర్ విజయ్‌కృష్ణన్ స్థానిక తిరుమల స్కూల్‌లో నూతన ఉపాధ్యాయుల భోజన వసతులను పరి శీలించారు. వారితో మాట్లాడారు.



శ్రీచైతన్య టెక్నో స్కూల్ గ్రౌండ్‌లో అభ్యర్థులు



పాయకరావుపేట ఓ హోటల్‌లో భోజనాలు చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

నిబంధనలకు విరుద్ధంగా తరగతుల నిర్వహణ : ఎస్ఎఫ్ఐ

ఎస్. రాయవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్. రాయవరంలోని వినయ్ స్కూల్ యాజమాన్యం పదో తరగతి విద్యార్థులకు దసరా సెలవులో నిబంధనలకు విరుద్ధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించినట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం బాలాజీ ఆరోపించారు. ముందుగా అందిన సమాచారం మేరకు బుధవారం ఈ స్కూల్‌కు వెళ్లి పరిశీలించామన్నారు. అయితే, ఆ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు సమీపంలో ఉన్న ఓ కొబ్బరి తోటలోకి తరలించి తరగతులు నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తించామని ఆరోపించారు. తరగతులకు రాకుంటే రూ.200 చెల్లించాలని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేసినట్టు బాలాజీ ఆరోపించారు.అడ్డరోడ్డు తిమ్మాపురంలో గల విశ్వశాంతి పాఠశాలలో కూడా విద్యార్థులకు తరగతులు నిర్వహించారని బాలాజీ తెలిపారు. దీనిపై ఎంఈవో-2 శ్రీరామమూర్తి వద్ద ప్రస్తావించగా, విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపుతోనే షాపుల వేలం



మాట్లాడుతున్న వైసీపీ నేత సాయిబాబా

పాయకరావుపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేటలో పంచాయతీ షాపుల వే లం పంచాయతీకి ఆదాయం సమకూరేందుకు కాకుండా కేవలం వైసీపీ నాయకులపై కక్ష సాధింపుతోనే నిర్వహించినట్టు ఉందని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గపల్లి సాయిబాబా ఆరోపించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న పంచాయతీ దుకాణాల లీజు వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఉన్నప్పటికీ డీపీఓ ఆదేశించారంటూ ఐదు నెలలు గడవు ముందుగానే వేలం నిర్వహించారన్నారు. ఈ షాపుల్లో లీజుదారుల్లో తనతోపాటు మరో వైసీపీ నాయకుడున్నాడనే కక్షతోనే ఇలా చేసినట్టు ఆయన ఆరోపించారు. ఈ వేలంలో కొంత మంది సభ్యులు, కూటమి నాయకులు ఒకటై షాపుల వేలం 2, 3 శాతం కంటే ఎక్కువ పంచాయతీకి ఆదాయం రాకుండా చేశారని ఆరోపించారు. ఈ అవకతవకలపై జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు.రాష్ట్ర హోం మంత్రి అనిత జోక్యం చేసుకోవాలన్నారు. దీనిని రద్దుచేసి వచ్చే ఏడాది మార్చిలో కొత్తగా షాపులు కేటాయించాలని కోరారు.

జీవీఎంసీ విలీన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- గత ప్రభుత్వం అభివృద్ధి పనులు చేయకపోయినా చేసినట్టు చూపింది
- అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

కొత్తూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)లో చాలా గ్రామాలు విలీనమైనప్పటికీ డ్రైనేజీలు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందలేదని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైనేజీ అధ్వానంగా ఉందని, గత ప్రభుత్వం పనులు చేయకపోయినా చేసినట్టు చూపించిందని విమర్శించారు. అనకాపల్లి మున్సిపల్ ఆఫీసు డంపింగ్ యార్డులా ఉం దన్నారు. ఇక్కడి డంపింగ్ యార్డు మరో ప్రాంతానికి తరలించేందుకు అధికా రులు సహకరించాలని కోరారు. ఒక్క అనకాపల్లి జోనల్ పరిధిలో 300 ఉద్యో గాలు ఖాళీగా ఉన్నాయని, టౌన్ ప్లానింగ్ అధికారులు లేరని వివరించారు. జోన్ అంతా ఒకే నియోజకవర్గంలో ఉంచాలని ఆయన అభిప్రాయపడ్డారు. విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దాలని మంత్రి లోకేశ్ ఎక్కువ ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. దేశంలో రోజుకు 18 గంటలు పనిచేస్తున్న ఏకేక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడని, అదే స్థాయిలో విద్యాశాఖ మంత్రి లోకేశ్ పనిచేస్తున్నారని వివరించారు.

నాటకరంగాన్ని ఆదరించాలి

- ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాల్లో మాజీ మంత్రి 'దాడి'


జ్యోతి ప్రజ్వలన చేసి నాటకోత్సవాన్ని ప్రారంభిస్తున్న దాడి వీరభద్రరావు


ఆవేశంలో ఆనందం నాటికలో ఓ సన్నివేశం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) :నాటకరంగాన్ని అంతా ఆదరించాలని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా గవరపాలెం సతకంపట్టు వద్ద బుధవారం రాత్రి ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఇక్కడ కనక దుర్గమ్మ ఆలయ నిర్మాణం జరిగి తొమ్మిదేళ్లు పూర్తయ్యిందన్నారు. ఏటా ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ భీమరశెట్టి వరహానూకరాజు, కర్రి సన్యాసినాయుడు, కొణతాల మురళీకృష్ణ, సూరిశెట్టి రమణ అప్పారావు, పెంటకోట సుబ్రహ్మణ్యం, బుద్ధ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన మల్లాది క్రియేషన్స్ బృందం ప్రదర్శించిన 'ఆవేశంలో ఆనందం', గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ బృందం ప్రదర్శించిన 'ఇది అతని సంతకం' నాటికలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

హాకర్స్ జోన్ ఏర్పాటుకు వ్యాపారులు ఆందోళన



జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, వ్యాపారులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పలువురు వ్యాపారులు బుధవారం జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి రోడ్ల పక్కన చిన్నచిన్న దుకాణాలు పెట్టుకొని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేదలపై జీవీఎంసీ అధికారులు దారుణంగా వ్యవహరించడం తగదన్నారు. ప్రభుత్వం ఉపాధి చూపక, ఏ ఆధారం లేక రోడ్ల పక్కన చిన్నచిన్న దుకాణాలు, తోపుడు బండ్లు, కూరగాయలు అమ్ముకుంటున్న వారికి ఉపాధి లేకుండా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం జోనల్ కమిషనర్ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాళ్ల తేలయ్యబాబు, శ్రీను, రమణ, లక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

కశింకోట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నూతనగుంటపాలెంలో పశువులకు బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నాలుగు నెలలు దాటిన దూడలకు, పశువులన్నింటికీ ఈ వ్యాధి రాకుండా ఉండాలంటే టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. వ్యాధి సోకి చికిత్సలు అందించే కంటే, ముందస్తుగానే టీకాలు వేయడం వల్ల పశువులు ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగబిల్లి పశు వైద్యాధికారిణి డాక్టర్ ఆల్ఫాన్స్‌జార్జి, సిబ్బంది పాల్గొన్నారు.

'పీఏసీఎస్ అభివృద్ధికి సభ్యులు కృషి చేయాలి'


వార్షిక బడ్జెట్‌ను చదివి వినిపిస్తున్న సీఈవో

కశింకోట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘ అభివృద్ధికి సభ్యులంతా తమవంతు కృషి చేయాలని కశింకోట పీఏసీఎస్ సీఈవో ద్వారపురెడ్డి నూకేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం సంస్థ కార్యాలయ ప్రాంగణంలో పర్సన్ ఇన్‌చార్జి సిహెచ్.మరిడియ్య అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో వార్షిక నివేదిక, బడ్జెట్‌ను చదివి వినిపించారు. ప్రస్తుతం సంఘంలో 5,867 మంది సభ్యులు ఉండగా, రూ.17 కోట్ల టర్నోవర్‌తో నడుస్తుందన్నారు. ఆడిట్ నివేదిక ప్రకారం గత ఆర్థిక సంవత్సరం రూ.16,58,983ల నికరలాభం ఆర్జించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నడిపల్లి సన్యాసిరావు, పందల యల్లయ్యనాయుడు, అల్లవరపు నాగు, పోతల రామారావు, గొంతిన అప్పారావు, కె.రమణ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ వద్ద ఆక్రమణల తొలగింపు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : భీమునిగుమ్మం జంక్షన్ నుంచి రైల్వేస్టేషన్ బుకింగ్ కార్యాలయానికి వెళ్లే మార్గంలోని ఆక్రమణలను బుధవారం జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. ఎక్స్‌కవేటర్, లారీలను ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై ఉన్న బడ్డీలన్నింటినీ తొలగించారు. పట్టణంలో ఎవరు ఆక్రమణలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని జడ్సీ హెచ్చరించారు. టీపీవో వరప్రసాద్, టౌన్ ప్లానింగ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీలో 10 జోన్‌లు

- నియోజకవర్గంలోని వార్డులన్నీ ఒకే జోనల్ కార్యాలయంలోకి...
- పెందుర్తి, భీమిలి నియోజకవర్గాల్లో రెండేసి...
- జీవీఎంసీ ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం
- అక్టోబరు మొదటి వారంలో అధికారిక ఉత్తర్వులు?
- కొత్తజోన్‌లకు ఏర్పాట్లు చేసుకోవాలని హెచ్ఓడీలకు కమిషనర్ ఆదేశం
- అంతా సిద్ధం చేసుకోవాలని స్పష్టీకరణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గ్రేటర్ విశాఖపట్నం నగర పాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో ఇప్పటి వరకూ ఎనిమిది జోన్‌లు ఉండగా, ఇకపై పది కానున్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం నియోజకవర్గానికి ఒక జోన్ ఉండేలా అధికారులు ప్రతిపాదనలు తయారుచేశారు. విస్తీర్ణం రీత్యా భీమిలి, పెందుర్తి నియోజకవర్గాలకు రెండేసి జోన్‌లు, మిగిలిన నియోజకవర్గాలకు ఒక్కో జోన్ ఉండేలా అధికారులు పంపిన ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్టు తెలిసింది. మంగళవారం అమరావతి వెళ్లిన జీవీఎంసీ కమిషనర్, చీఫ్ సిటీప్లానర్‌లకు ప్రభుత్వ పెద్దలు మౌఖికంగా ఈ విషయం చెప్పారు. అక్టోబరు మొదటివారంలోగా అధికారిక ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉంది.

జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం ఎనిమిది జోన్‌లు ఉన్నాయి. విశాఖ మునిసిపల్ కార్పొరేషన్‌గా ఉన్నప్పుడు ఆరు జోన్‌లు ఉండగా, భీమిలి, అనకాపల్లి మునిసిపాలిటీల విలీనం తర్వాత గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)గా ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఎనిమిది జోన్‌లుగా పాలనసాగుతోంది. అధికారులు భౌగోళిక పరిస్థితులను ప్రామాణికంగా తీసుకుని జోన్‌లను విభజించారు. అందువల్ల ఒక జోన్ పరిధి ప్రస్తుతం రెండు, మూడు నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. ఉదాహరణకు తూర్పు నియోజకవర్గ పరిధిలో ఉన్న 9, 10, 11, 12, 13 వార్డులు ప్రస్తుతం జోన్-2 (మధురవాడ)లో ఉన్నాయి. జోన్-2లో అధికభాగం భీమిలి నియోజకవర్గం ఉంది. అలాగే ఉత్తర నియోజకవర్గ పరిధిలో ఉన్న 14, 24, 25, 26 వార్డులు జోన్-3 (ఆశీల్‌మెట్ట)లో ఉన్నాయి. జోన్-3లో అత్యధిక భూభాగం తూర్పు నియోజకవర్గ పరిధిలో ఉంది. దీనివల్ల ఆయా వార్డులకు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర సమస్యలపై సమావేశం ఏర్పాటుచేయాలనుకుంటే రెండు, మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతోపాటు రెండు, మూడు జోన్‌ల అధికారులను పిలవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఆ సమావేశానికి ఏదో కారణం చేత ఏ ఒక్క అధికారిగానీ, ఎమ్మెల్యేగానీ హాజరుకాకపోతే కొన్ని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఒక నియోజకవర్గ పరిధిలోని వార్డులన్నీ కలిపి ఒకే జోన్‌లో ఉంటే పాలనాపరంగా తలెత్తుతున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అధికారులు చాలాకాలంగా అభిప్రాయపడుతున్నారు. ఈ విషయం ప్రజా ప్రతినిధుల వద్ద పలుమార్లు ప్రస్తావించారు. ఇటీవల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కేతన్‌గార్గ్ వద్ద అధికారులు జోన్‌ల పునర్వ్యవస్థీకరణ అంశాన్ని ప్రస్తావించగా, ఆయన జీవీఎంసీ పరిధిలోని ప్రజా ప్రతినిధులతో చర్చించారు. వారంతా సరేనని చెప్పడంతో నియోజకవర్గాల వారీగా జోన్‌లను పునర్వ్యవస్థీకరించే ప్రతిపాదన తయారుచేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, అదనపు కమిషనర్, జోనల్ కమిషనర్లు పలుమార్లు సమావేశమై వార్డులు, జోన్‌ల మ్యాప్‌లను పరిశీలించారు. సుదీర్ఘ కసరత్తు తర్వాత ఒక నియోజకవర్గం పరిధిలో ఉన్నవార్డులను ఒకే జోన్ పరిధిలోకి మార్చుతూ డ్రాఫ్టును తయారుచేశారు. భీమిలి, పెందుర్తి నియోజకవర్గాల విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో సరిహద్దు వార్డుల్లో ఉండేవారు తమ జోనల్ కార్యాలయాలకు వచ్చిపోవడానికి ఇబ్బందిగా ఉంటుంది కాబట్టి ఆయా నియోజకవర్గాల్లో రెండేసి జోన్‌లు ఉండేలా విభజించారు. తూర్పు, దక్షిణ, ఉత్తర, పశ్చిమ, గాజువాక, అనకాపల్లి నియోజకవర్గాలకు ఒక్కో జోనల్ కార్యాలయం ఉండేలా తయారుచేసిన ప్రతిపాదనను గత నెల 22న జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఆమోదానికి పెట్టారు. కౌన్సిల్ ఆమోదించి ప్రభుత్వ అనుమతికి పంపించింది. దీనికి రాష్ట్రప్రభుత్వం కూడా దాదాపు అంగీకరించడంతో త్వరలో అధికారిక ఉత్తర్వులు వెల్లడికానున్నాయి. వచ్చేనెల ఏడో తేదీ నాటికి కొత్తజోన్‌లు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని, అందుకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తిచేసుకోవాలని అన్నివిభాగాల అధిపతులకు జీవీఎంసీ కమిషనర్ బుధవారం ఆదేశించినట్టు అధికారులు చెబుతున్నారు. కొత్త జోనల్ కార్యాలయాలు ఏర్పాటుకు భవనాలను గుర్తించడంతోపాటు సిబ్బంది, ఫర్నీచర్‌ను సిద్ధం చేసుకోవాలని సూచించినట్టు సమాచారం.


విశాఖపట్నంలోని జీవీఎంసీ ప్రధాన కార్యాలయం

కొత్తగా ఏర్పాటయ్యే జోన్‌లలోకి వచ్చే వార్డులు

- భీమిలి జోన్-1: 1, 2, 3, 4
- భీమిలి జోన్-2: 5, 6, 7, 8, 98
- తూర్పుజోన్ : 9,10,11,12,13, 14,15,16,17,18,19,20.21,22,23,28
- ఉత్తర జోన్: 14,24,25,26,42,43, 44,45,46,47,48,49,50, 51,53,34,55
- దక్షిణ జోన్: 27,29,30,31,32, 33,34,35,36,37,38,39,41
- పశ్చిమ జోన్: 40,52,56,57,58,59, 60,61,62,63,89,90,91,92
- పెందుర్తి జోన్-1: 88,93,94,95,96,97
- గాజువాక జోన్: 64,65,66,67,68,69,70, 71,72,73,74,75,76,86,87
- పెందుర్తి జోన్-2: 77,78,79,85
- అనకాపల్లి జోన్: 80,81,82,83,84

నమో మాతా.. నమోస్తుతే..

- వాడవాడలా నేత్రపర్వంగా నవరాత్రి ఉత్సవాలు
- వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన దుర్గమ్మ
- నూకాంబిక ఆలయంలో కలెక్టర్ పూజలు


అనకాపల్లిలో ధనలక్ష్మి అవతారంలో కన్యకాపరమేశ్వరీ అమ్మవారు


నూకాంబిక ఆలయంలో అమ్మవారి పూజల్లో పాల్గొన్న కలెక్టర్ విజయకృష్ణన్


తుమ్మపాలలో అన్నపూర్ణాదేవిగా..

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజు బుధవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అనకాపల్లిలోని నూకాంబిక ఆలయంలో నిర్వహించిన లక్ష్మీగణపతి హోమానికి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత హాజరయ్యారు. సుజాత ముందుగా బాలాలయంలోని అమ్మవారిని దర్శించుకున్నారు. కలెక్టర్, డీసీలను ఆలయ ఈవో కె.ఎల్ . సుధారాణి, మాజీ ఛైర్మన్ పీలా నాగశ్రీను సత్కరించి, ప్రసాదాన్ని అందజేశారు. సతకంపట్టులోని కనకదుర్గమ్మ గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే, కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ధనలక్ష్మి అలంకరణలో అమ్మవారిని అలంకరించారు. ఉత్సవమూర్తిని వెండి రథంపై ఆలయం చుట్టూ ఊరేగించారు. నిదానందొడ్డిలోని కామాక్షిదేవి ఆలయంలో ధనలక్ష్మీదేవిగా అమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే, పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గల ఆలయాల్లో, మండపాల్లో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

కొత్తూరు : సత్యనారాయణపురం కళ్యాణ గిరిపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో, పిసినికాడలోని కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

తుమ్మపాల : ఇక్కడి పంచాయతీ వాటర్ వర్క్సు ఆధ్వర్యంలో నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు.

పరిశుభ్రత పాటిస్తే అంటువ్యాధులు దూరం

- జడ్సీ చక్రవర్తి సూచన
- పట్టణంలో విస్తృత పర్యటన
- అన్న క్యాంటీన్‌లో చట్నీలో నాణ్యత కొరవడడంపై హెచ్చరిక


అన్న క్యాంటీన్‌లో ఆహార పదార్థాల్లో నాణ్యత తెలుసుకుంటున్న జడ్సీ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పేదలకు అందించే ఆహార పదార్థాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె. చక్రవర్తి స్పష్టం చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. అన్న క్యాంటీన్‌లో అల్పాహారం ఇచ్చేటప్పుడు చట్నీలో నాణ్యత కొరవడినట్టు తన దృష్టికి వచ్చిందని, దీనిపై నిర్వాహకులకు హెచ్చరిక జారీ చేశామన్నారు. గూడ్స్‌షెడ్ వద్ద రోడ్డుపై చేపల అమ్మకాలను నియంత్రించారు. పలు ప్రాంతాల్లో మహిళలతో మాట్లాడుతూ జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వర్షాలు పడుతున్నందున పరిసరాల పరిశుభ్రతకు అంతా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అప్పుడే అంటు వ్యాధులు దరిచేరవన్నారు. జీవీఎంసీ సిబ్బంది ఇళ్లకు వచ్చేటప్పుడు తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు. అలాగే శ్రీరామనగర్ కాలనీని సందర్శించి రోడ్డుపై చెత్త వేయకుండా డంపర్ బిన్‌ను ఏర్పాటు చేశారు. ఆయన వెంట శానిటేషన్ సూపర్‌వైజర్ రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

వినాయక ఘాట్‌ను శుభ్రపర్చాలని వినతి

శారదా నది ఒడ్డున గల వినాయక ఘాట్‌ను శుభ్రపరిచి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వినాయక ఉత్సవ నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపకులు ఆడారి కుమారస్వామి జడ్సీని కలిసి కోరారు. శరన్నవరాత్రి ఉత్సవాలు పూర్తయిన తరువాత అమ్మవార్ల విగ్రహాలను నమిజ్జనం చేసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఇక్కడకు వస్తారని వివరించారు. ఈ దృష్ట్యా ఘాట్ శుభ్రం చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట కొణతాల హరనాథబాబు, ప్రకాశరావు, వెంకట శ్యామ్ తదితరులు ఉన్నారు.

మహిళలు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

- 'స్వస్థ్ నారీ- సశక్తి పరివార్' ప్రారంభోత్సవంలో గండి బాబ్జీ



మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న గండి బాబ్జీ

సబ్బవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ సూచించారు. మండలంలోని మొగలిపురం, బాటజంగాలపాలెం గ్రామాల్లో బుధవారం ఏర్పాటైన 'స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ (ఆరోగ్యవంతమైన మహిళ-శక్తివంతమైన కుటుంబం) కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళల ఆరోగ్య భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఈ బృహత్కార్యాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఇందులో భాగంగా 13 ఏళ్లు దాటిన మహిళలకు గుండె జబ్బులు, మధుమేహం, నోటి కేన్సర్, గర్భాశయ కేన్సర్ పరీక్షలను ఉచితంగా చేస్తారన్నారు. అనంతరం ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు భరణికాన బాబూరావు, వైసీపీ నాయకుడు గండి రవికుమార్, సర్పంచ్ పడాల వెంకటరమణ, బంగారునాయుడు, నానాజీ, యడ్ల నాయుడు, మేడపాటి రాము, వనం సత్యనారాయణ, డాక్టర్ ఆశా, డాక్టర్ విశ్వనాథ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సమష్టి కృషితో గ్రామాలు సుస్థిర అభివృద్ధి

సబ్బవరం, పెందుర్తి మండలాల సర్పంచులు, కార్యదర్శుల శిక్షణలో వక్తలు



సర్పంచులు, కార్యదర్శుల శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. సబ్బవరం, పెందుర్తి మండలాల సర్పంచులు, కార్యదర్శులకు ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 'లోకలైజేషన్ ఆఫ్ సస్టయినబుల్ డెవలప్‌మెంట్ గోల్' అంశంపై ఏర్పాటైన రెండు రోజుల శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. పంచాయతీల అభివృద్ధి కార్యదర్శుల చేతుల్లోనే ఉందన్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు పక్కాగా రూపొందించేందుకు ఇటువంటి శిక్షణలు దోహదపడతాయన్నారు. పేదరికం లేని సమాజమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే గ్రామాలు సుస్థిరమైన అభివృద్ధి సాధించినట్టని వివరించారు. ప్రకృతిని నాశనం చేస్తున్న ప్లాస్టిక్ వినియోగాన్ని అడ్డుకునేందుకు కృషి చేయాలన్నారు. సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ, పెందుర్తి డిప్యూటీ ఎంపీడీవో కామేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలు అవార్డులు పొందేలా పనిచేసేందుకు ఇటువంటి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏవో వీవీ పంతులు, డిప్యూటీ ఎంపీడీవో డి.చైతన్య, ఈవో వై.రాజేశ్వరరావు, సర్పంచులు దెడ్డం ప్రసాదరావు, వడ్డాది అప్పలరాజు, బోకం రామునాయుడు, బండారు శ్రీను, బోను నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ అధికారులతో కలెక్టర్ సమీక్ష

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం సాయంత్రం పంచాయతీ అధికారులతో పంచాయతీరాజ్‌కు సంబంధించిన పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పనుల పురోగతిని ఆయా అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ రెగ్యులర్, ప్రాజెక్ట్ పర్యవేక్షణ ఇంజనీర్లు ఆర్ఎస్ ప్రసాద్, జీఎస్ఎస్ ప్రసాద్, ఉప కార్యనిర్వాహక, సహాయ ఇంజనీర్లు పాల్గొన్నారు.

'ఆర్టీసీ కాంప్లెక్స్ అభివృద్ధికి సహకరించండి'

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ అభివృద్ధికి, ఆక్రమణల తొలగింపునకు సహకరించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ కె.హనుమశ్రీ బుధవారం జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తిని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురిస్తే కాంప్లెక్స్‌లో నీరు బయటకు వెళ్లకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. జీవీఎంసీకి చెందిన డ్రైన్‌ను సరిచేసి కాంప్లెక్స్ ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కాంప్లెక్స్ బయట ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. దీనిపై జోనల్ కమిషనర్ చక్రవర్తి సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

డిపాజిటర్లకు అత్యధిక వడ్డీ ఇచ్చేది గ్రామీణ బ్యాంకే : ఛైర్మన్


బ్రాంచ్ ప్రారంభంలో మాట్లాడుతున్న ప్రమోద్‌కుమార్‌రెడ్డి

కశింకోట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : డిపాజిట్ చేసిన వారికి అత్యధిక వడ్డీ ఇచ్చేది ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మాత్రమేనని రాష్ట్ర గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ కె.ప్రమోద్ కుమార్‌రెడ్డి అన్నారు. తాళ్లపాలెంలో బ్యాంకు నూతన భవనాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక ఖాతాదారులు కలిగిన రెండో బ్యాంకు గ్రామీణ బ్యాంకుగా పేర్కొన్నారు. లక్షా 20వేల కోట్ల రూపాయల టర్నోవర్ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందని చెప్పారు. జీవిత బీమా, మొబైల్ బ్యాంకింగ్, బ్యాంక్ మిత్ర, రూపే ఏటీఎం కార్డు, ప్రధాన మంత్రి జీవనజ్యోతి తదితర రుణాలను ఈ బ్యాంకు ద్వారా పొందాలని కోరారు. రీజనల్ మేనేజర్ సతీష్ చంద్ర, బ్యాంకు మేనేజర్ మల్లవరపు మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

డీవీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌కు బెస్ట్ మెంటార్ అవార్డు



అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి డీవీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.దయామాధురికి అవార్డు లభించింది. నేషనల్ టీచర్స్ డే సందర్భంగా బెస్ట్ మెంటార్ అవార్డు ఫర్ స్టూడెంట్ సక్సెస్‌ను విజయనగరం జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ రాజ్యలక్ష్మి చేతుల మీదుగా మంగళవారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్, సిబ్బంది బుధవారం అభినందించారు.

'మెడికల్ కళాశాలలు పీపీపీ విధానంలో నడపాలన్న నిర్ణయం తగదు'

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో నడిపించేందుకు తీసుకువచ్చిన జీవో 590ను రద్దు చేయాలంటూ కోరుతూ సీపీఐ నాయకులు బుధవారం నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ పీపీపీ విధానం పేరుతో వైద్య కళాశాలలన్నింటినీ కార్పొరేట్‌లకు అప్పజెప్పే ఆలోచన విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు దేముడుబాబు, బాబ్జీ, సత్తిబాబు, శంకరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పల్లో ఓటరు కార్డులు

» జీకే వీధిలో బీఎల్‌వోల నిర్లక్ష్యం



జీకేవీధిలో సంపద కేంద్రం వద్ద ఓటరు ఐడీ కార్డులు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం వద్ద చెత్తలో వందల సంఖ్యలో ఓటర్ ఐడీ కార్డులు పడి ఉన్నాయి. ఓటర్లకు పంపిణీ చేయాల్సిన ఈ కార్డులు ఇలా చెత్తలో ఉండడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఒకరికి రెవెన్యూశాఖ పరిధి బీఎల్‌వోలా ద్వారా ఓటరు కార్డులను అందజేస్తోంది. ఉద్యోగుల నిర్లక్ష్యం వల్ల విలువైన కార్డులు చెత్త కుప్పలో పడేశారు. ఓటర్లకు అందించకుండా ఇలా చెత్తలో పారేసిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ అన్నాజీరావు వద్ద ప్రస్తావించగా, చెత్తలో పడివున్న ఓటరు కార్డులు 23 బూత్ పరిధిలోనివిగా గుర్తించామన్నారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



సీహెచ్‌సీ ఆవరణలో శుభ్రం చేస్తున్న జవాన్లు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 24, (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సీఆర్‌పీఎఫ్ జి198 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ శరవణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం బెటాలియన్ కమెండెంట్ రామ్ పాలట్ ఆదేశాలతో స్థానిక సీహెచ్‌సీ, శిశు జనన నిరీక్షణ కేంద్రం, నాలుగు రోడ్ల జంక్షన్ తదితర ప్రాంతాల్లో జవాన్లు చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టారు. పలు చోట్ల జంగిల్ క్లియరన్స్, మురికి కాలువలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి ధరణి, సీఆర్‌పీఎఫ్ ఎస్‌ఐలు కృష్ణారావు, జైసిరావు, అధికారులు పాల్గొన్నారు.

అరకులోయలో విస్తృత తనిఖీలు



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ గోపాలరావు

అరకులోయ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అరకులోయ పట్టణంలో స్థానిక ఎస్‌ఐ గోపాలరావు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో అనుమానితులను ప్రశ్నించారు. వాహనాల రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లను, హెల్మెట్ ధరించాలని వాహనదారులకు సూచించారు. నిబంధనలు పాటించకుంటే వాహనాలను సీజ్‌చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలిచ్చినా తల్లిదండ్రులపై కేసులు నమోదుచేస్తామన్నారు. గంజాయి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని అవగాహన కల్పించారు. ఆటో, టాక్సీ స్టాండ్‌ల వద్ద వాహనాలకు సంబంధించిన రికార్డులు ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని అవగాహన కల్పించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న నేతలు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామాలయం వీధిలో జడ్పీ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులకు బుధవారం సర్పంచ్ సుభాష్ శంకుస్థాన చేశారు. వీధి రోడ్లు వర్షాలకు బురదమయంగా మారుతున్నాయి. ఈ విషయాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకువెళ్లగా ఆమె స్పందించి నిధులు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో సుమారు 100 మీటర్లు సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ, వైసీపీ నేతలు సన్యాసిరావు, పాపారావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీ సాయి జయంతి

సీలేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో బుధవారం షిర్డీ సాయిబాబా జయంతి వేడుకలను ప్రారంభించా రు. స్థానిక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా తెల్లవారుజామున నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే, ప్రత్యేకపూజలు, అభిషేకాలను నిర్వహించారు. ఈ వేడుకలు ఈ నెల 28 వరకు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ నిర్వాహకులు పిల్లా సాంబమూర్తి ఈ సందర్భంగా తెలిపారు.

మండల సమావేశం రేపు

చింతపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల సాధారణ సర్వ సభ్య సమావేశం ఈనెల 26న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ కోరాబు అనుషదేవి అధ్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు విధిగా హాజరుకావాలన్నారు. ఇప్పటికే ఆహ్వానాలు పంపించామన్నారు.

అడవితల్లి బాటతో మహర్దశ

» డిప్యూటీ సీఎం పవణ్‌కల్యాణ్ చొరవతో రోడ్లు

» పెదపాడు రూ.1.8 కోట్లతో రహదారి నిర్మాణం

» మరో పది గ్రామాలకు రవాణా సదుపాయం కల్పనకు చర్యలు

డుంబ్రిగుడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అడవి తల్లిబాట కార్యక్రమంతో మారుమూల గిరిజన గ్రామాలకు మహర్దశ పడుతోంది. గతంలో పెదపాడు గ్రామ గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో పలుమార్లు గిరిజనులు తమ గ్రామ రహదారి నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని అధికారులు, పాలకులకు వినతిపత్రాలు అందించినా ఫలితంలేకపోయింది. ఈ స్థితిలో గత ఏప్రిల్ 7వ తేదీన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అడవితల్లి బాటలో భాగంగా మండలంలో పర్యటించారు. ఈ సమయంలో ఆయన దృష్టికి గిరిజనులు గ్రామ రోడ్డు సమస్యను తీసుకువెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. దీంతో అధికారులు తక్షణమే రోడ్డు నిర్మాణంపై చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం పెదపాడుకు రోడ్డు నిర్మాణ పనులు చేపడుతుండడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

రోడ్లు మంజూరైన గ్రామాలు...

మరో పది గ్రామాలకు రోడ్లు మంజూరయ్యాయి. చాపరాయి నుంచి పెదపాడుకు 1.8 కోట్లు, పోడ్డగుడ 1.47 కోట్లతో బీటీ రోడ్లు ప్రారంభమయ్యాయి. తడ్డా రూ. 275 లక్షలు, బుడ్డంగి రూ. 148 లక్షలు, చెలిమర వలస రూ. 275 లక్షలు, శెటిబంధ రూ. 110 లక్షలు, కోసంగి రూ. 185 లక్షలు, బలియగుడ రూ. 120 లక్షలు, రంగినివలస రూ. 125 లక్షలు, పోడుజోల రూ. 115 లక్షలు, సిమిలిగుడ రూ. 105 లక్షలు మొత్తం గ్రామాలకు రహదారి నిర్మాణాలు చేపడుతున్నారు.



నూతనంగా చేపడుతున్న బీటీ రోడ్డు



పెదపాడుకు గతంలో కంకరతో ఉన్న రహదారి (ఫైల్)

డిజిటల్ అక్షరాస్యత అవసరం



కిశోర బాలికలతో మాట్లాడుతున్న వాసవ్య మండలి ప్రతినిధులు

చింతపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు డిజిటల్ అక్షరాస్యత సాధించాలని వాసవ్య మహిళా మండలి ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ సుబ్బారావు అన్నారు. బుధవారం చింతపల్లి, కొమ్మంగి, చైడుపల్లి, లోతుగెడ్డ పంచాయతీల పరిధిలో కిశోర బాలికలకు జీవిత నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ మాట్లాడుతూ కిశోర బాలికలు డిజిటల్ అక్షరాస్యతపై చైతన్యవంతులు కావాలన్నారు. మానసిక ఆరోగ్యం, భద్రత, సురక్ష, భవిష్యత్తు ప్రణాళికలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సెలర్లు సంగీత, సంధ్య పాల్గొన్నారు.

పెదూరులో దసరా వేడుక



గృహాలను సందర్శిస్తున్న విద్యార్థులు

చింతపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంస్కృతిని కాపాడుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ సంస్కృతి ప్రముఖ్ టి. కొండబాబు అన్నారు. బుధవారం మండలంలోని పెదూరు గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ బాలవికాస్ పాఠశాల విద్యార్థులతో కలిసి దసరా నవరాత్రులు నిర్వహించారు. తొలుత గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులతో ఇం టింటికి వెళ్లారు. వీరికి పూలతో గిరిజనులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సంస్కృతి ప్రముఖ్ మాట్లాడుతూ, పండగల సమయంలో ఆదివాసీలు నిర్వహించే సంప్రదాయ కళలు అంతరించిపోతున్నాయన్నారు. వీటికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస్ ఆతాజీ మణి, అర్చకులు రాజయ్య, సూరిబాబు, ధర్మప్రచారక్ నారాయణదాస్, ఉపాధ్యాయుడు వెంకట గిరి పాల్గొన్నారు.

ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న సీడీపీవో స్రవంతి

పెదబయలు సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ పథకం ద్వారా మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో స్రవంతి తెలిపారు. పాతపాడు, గుణలోవ, తగ్గుపాడు, బొంగడారి కేం ద్రాలలో ఆయా పోస్టులకు భర్తీ చేయనున్నట్టు చెప్పారు. గిరిజన అభర్థులు 2025 జూలై 1 నాటికి 21 ఏళ్లనుంచి 35 ఏళ్ల పూర్తయిన, స్థానిక గ్రామాలకు చెందిన వివాహితురాలై ఉండాలని తెలిపారు. అక్టోబర్ 8 వ తేదీ లోగా తమ ఆధార్, రేషన్, పదోవతరగతి మార్కు సీటు, కుల, రెసిడెన్సియల్ ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జడుగురులో ఖాళీ..

చింతపలి: మండలంలోని కుడుముసారి పంచాయతీ జడుగూరు అంగన్‌వాడీలో ఆయా పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక సీడీపీవో సీహెచ్ శ్రీదేవి తెలిపారు.ఈ పోస్టుకి పదో తరగతి ఉత్తీర్ణులై, వితంతువు, లేదా మైనర్ పిల్లలు కలిగిన వి తంతువుకి ప్రాధాన్యం ఇస్తామన్నారు.అక్టోబరు 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బుడ్డంగి గ్రామంలో..

డుంబ్రిగుడ,: మండలంలోని తూటంగి పంచాయతీ బుడ్డంగి అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలి పోస్టుకు దరఖాస్తును ఆహ్వానిస్తున్నామని సీడీపీవో ఎస్తేరు రాణి తెలిపారు. వచ్చే నెల 8 వరకు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

గాయపడిన విద్యుత్ కార్మికుడ్ని ఆదుకోవాలి



విద్యుత్‌షాక్‌తో గాయపడిన అప్పలరాజును పరామర్శిస్తున్న సీఐటీయూ నేతలు

అరకులోయ,సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాశావత్తు గాయపడిన విద్యుత్ కాంట్రాక్టు కార్మికుడు మజ్జి అప్పలరాజును ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరావు డిమాండ్ చేశారు. మంగళవారం అరకులోయ సబ్‌స్టేషన్ లో పనిచేస్తున్న అప్పలరాజువిద్యుత్ షాక్‌లోనై ప్ర మాదానికి గురయ్యారు. గాయాలతో ప్రస్తుతం స్థానిక ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను బుధవారం పరామర్శించామన్నారు. అప్పలరాజుకు సంపూర్ణ వైద్యసేవలందించాలన్నారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకుహెల్త్ కార్డులతో పా టు రూ. కోటి ప్రమాద బీమాఇవ్వాలని డిమాండ్‌చేశారు. అప్పలరాజును విద్యుత్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నిరంజన్ తదితరులు పరామర్శించారు.

చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలి

» ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త ప్రదీప్‌కుమార్



వాకపల్లిలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారులు

జి.మాడుగుల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంటల్లో చీడపీడల నివారణపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త డా. ప్రదీప్‌కుమార్ చెప్పారు. బుధవారం నుర్మతి పంచాయతీ వాకపల్లిలో పొలంబడి కార్యక్రమంలో నిర్వంచారు. ఈ సందర్భంగా రైతులకు రాజ్‌మాసాగు, విత్తనాలు శుద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వరిపంటలో నానో యూరియా మేలుపై ఏవో వరప్రసాద్ సూచించారు. జీవన ఎరువులైన ఫాస్పరస్ రిలీజంగ్ బాక్టీరియా ద్వారా ఉపయోగాలు, ఆకు ముడత పురుగు వాటి నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూరిబాబు, సిబ్బంది సూర్యనారాయణ, ప్రశాంత్‌కుమార్, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన యాజమాన్య పద్ధతులతో అధికదిగుబడులు

గూడెంకొత్తవీధి: గిరిజన రైతులు వ్యవసాయంలో నూతన యాజమాన్య పద్ధతులను పాటించాలని స్థానిక ఏవో డి. గిరిబాబు అన్నారు. బుధవారం మండలంలోని బొడ్డుమానుపాలులో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు రాజ్‌మా, వరి సాగులో మెలకువలు పాటించాలన్నారు. వరిలో ఆకు ముడత తెగులు నివారణ చర్యలు ప్రారంభించాలన్నారు. రాజ్‌మాలో రసం పీల్చే పురుగు నివారణకు వేపనూనె ఒక లీటరు నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలన్నారు.

ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు కృషి: ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ అనుషదేవి

చింతపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని స్థానిక ఎంపీపీ కోరాబుఅనుషదేవి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐక్యరాజ్య సమితి సూచించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఎంపీడీవో సీహెచ్. సీతామహాలక్ష్మి అధ్యక్షతన చింతపల్లి, జీకేవీధి మండలాల కార్యదర్శులు, సర్పంచ్‌లకు రెండు రోజుల శిక్షణ తరగతులను ఎంపీపీ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షిస్తూ.. మానవుల జీవన విధానం మెరుగుపర్చుకోవడానికి ఐక్యరాజ్య సమితి 17 లక్ష్యాలను సూచించిందన్నారు. ఈ లక్ష్యాలపై తొమ్మిది విభాగాలుగా సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండు రోజులపాటు శిక్షణ అందిస్తున్నారన్నారు. పంచాయతీకి ప్రథమ పౌరుడైన సర్పంచ్, కార్యదర్శులు ఈ లక్ష్యాలను గ్రామ స్థాయిలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, జీకేవీధి ఎంపీపీ బోయిన కుమారి, టీవో టీలు అరుణ్ కుమార్, సింహాద్రి నాయుడు పాల్గొన్నారు.

అటవీ వనరుల దోపిడీ: సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం నేత అప్పలనర్స

డుంబ్రిగుడ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలను అడవి నుంచి గెంటి వేసే కుట్రలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలనర్స పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేక పోరాట కమిటీ చేపట్టిన అరణ్య గర్జన జీపుజాత బుధవారం మండలంలో చేరుకుంది. ఈ సందర్భంగా జాకరవలసలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సహజ సిద్ధ నీటినరులను దోపిడీకి కార్పొరేట్ కంపెనీలు రాజ్యాంగ విరుద్ధంగా ఒప్పందాలు చేసుకున్నాయన్నారు. స్థానిక సర్పంచులు, పెసా కమిటీ సభ్యులు హైడ్రో పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా తీర్మానాలు చేస్తున్నా పట్టించుకోవడం తగదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు త్రినాథ్, ఎస్‌వీ పోతురాజు, సురేశ్, పి సత్యనారయణ, టి. సూర్యనారాయణ, గిరిజనులు పాల్గొన్నారు.

బురదగెడ్డ వంతెన మరమ్మతుకు రూ. 10 లక్షలు

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన.. త్వరలో నిర్మాణ పనులు : ఎంపీడీవో



శిథిలమైన వంతెన అప్రోచ్‌ను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ ఈఈ, మండల అధికారులు

అరకులోయ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండంలోని యండపల్లివలస సమీపాన బురదగెడ్డ వంతెన మరమ్మతులు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ ఎన్ఆర్‌జీఎస్ పథకం నుంచి రూ. 10 లక్షల నిధులు మంజూరు చేసినట్టు స్థానిక ఎంపీడీవో లవరాజు తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే ఈ కల్వర్టు పనులు చేపడతారని తెలిపారు. బుధవారం ఆర్ఈండ్‌బీ ఈఈ బురదగెడ్డ వంతెనను పరిశీలించారని తెలిపారు. అలాగే, ఈ నెల 14 వ తేదీన 'ఆంధ్రజ్యోతి 'లో 'ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోరా' ? అనే శీర్షికన కథనం ప్రచురించింది. వంతెన మరమ్మతులు చేపట్టకుంటే అరకు-పాడేరుకు రహదారి మధ్య రాకపోకలు నిలిచిపోతాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ నేరుగా ఆర్అండ్‌బీ ఈఈని బురదగెడ్డ పరిశీలనకు పంపించారన్నారు. అనంతరం రూ. 10 లక్షలు మంజూరు చేశారు. త్వరితగతిన ఈ కల్వర్టు పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సీమనేరోడికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆందోళన



రోడ్డును చూపుతూ నిరసన చేపడుతున్న గ్రామస్థులు, జీఎస్‌యూ నేతలు

పెదబయలు, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ లోని పలు గ్రామాలకు సరైన రహదారి సౌకర్యాలు లేక గిరిజనులు రవాణా కష్టాలు ఎదుర్కొంటున్నారని గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు మణుగూరి బాబూజీ ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం ఆయన తన బృందంతో మండలంలోని కుంతుర్ల పంచాయతీ పరిధి మారుమూల సీమనేరోడి గ్రామాన్ని సందర్శించారు. ఈ గ్రామానికి పక్కా రహదారి లేకపోవడంతో అక్కడి గిరిజనులతో కలసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 20 కుంటుంబాలున్న ఈ గ్రామానికి సరైన రహదారి లేక అత్యవసరాల్లో అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికైనా అనారోగ్యానికి గురైతే డోలీలో రెండు కిలోమీటర్ల దూరంలో కిండలం వరకు తరలించాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. నిత్యావసర సరకులకు వారపు సంతలకు వెళ్లాలన్నా ఇక్కట్లు తప్పటం లేదని అంటున్నారు. వర్షం పడితే రోడ్డు చిత్తడిగా మారుతుందన్నారు. ఇకనైనా పభుత్వం స్పందించి ఈ గ్రామానికి పక్కా రహదారి నిర్మించాలని గ్రామస్థులు శాస్త్రిబాబు, సర్బంనాయుడు, మత్యరాజు, గంగరాజు, మహేశ్, సన్యాసినాయుడు, చిరు, చందు, చిన్నలదొర, బాలు కోరారు.

చింతపల్లిలో రూ.40 లక్షలతో కల్యాణమండపం

చింతపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రూ.40లక్షల ఎంపీ నిధులతో కల్యాణమండపం నిర్మిస్తున్నట్టు స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. బుధవారం వీరు పదవులు చేపట్టి నాలుగేళ్ల పూర్తి చేసుకోవడంతో కేక్ కట్ చేసి, ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్లలో మండల పరిషత్ నిధులతో ఎంపీటీసీ సభ్యులంతా సమష్టిగా రూ. 3 కోట్ల నిధులు ఖర్చుచేశామన్నారు. జడ్పీ నిధులు రూ.3.5కోట్లు వ్యయం చేసినట్టు చెప్పారు. ప్రధానంగా రూ.25లక్షల జడ్పీ నిధులతో జిల్లా పరిషత్ అతిథి గృహం మరమ్మతులు, రూ. 10 లక్షలతో ఐసీడీఎస్ కార్యాలయం, రూ.5 లక్షలు చొప్పున ఆరు అంగన్‌వాడీ కేంద్రాలు మరమ్మతులు చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీకేవీధి ఎంపీపీ బోయిన కుమారి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే



సర్టిఫికెట్లతో వలంటీర్లు, ప్రిన్సిపాల్ డా.భరత్‌కుమార్‌నాయక్ అధ్యాపకులు

అరకులోయ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ డే ఆవిర్భావం, లక్ష్యాలను వలంటీర్లకు వివరించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, విజయలక్ష్మి, అనితకుమారి మాట్లాడుతూ 2025-26లో చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. వికసిత్‌భారత్, భారత్‌కోసం నా యువత అనే అంశంపై అవగాహన కల్పించారు. వలంటీర్లంతా ఈ కార్యక్రమాల్లో పా ల్గొవాలని సూచించారు. వైస్‌ప్రిన్సిపాల్ కొండబాబు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ లోగో ప్రాధాన్యం వివరించారు. కళాశాలలో 20 మంది ఉత్తమ వలంటీర్లకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ పీవోలు, వలంటీర్లు ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్‌ను సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్.ఎం.ఎస్. గణేశ్, ఎస్.రాజు, బి.లచ్చన్న, వి.కామేశ్వరరావు, ఎస్.అప్పారావు, సోంబాబు, అంబికాభవాని, ఎస్.డొన్ను, సీహెచ్.వన్యపాల్, బోధనేతర సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయానికి కుర్చీలు వితరణ



కుర్చీలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

చింతపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయానికి టీడీపీ నాయకులు వ్యక్తిగత నిధులతో కొనుగోలు చేసిన కుర్చీలను విరాళంగా ఇచ్చారు. బుధవారం వీ టిని తహసీల్దార్ జి. ఆనందరావుకి అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు మాట్లాడుతూ రె వెన్యూ కార్యాలయంలో ఉద్యోగులు, వివిధ సేవల కోసం వచ్చిన ప్రజలు కూర్చోవడానికి వీలుగా వీటిని అందించామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ గెమ్మెలి అబ్బాయినాయుడు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, నాయకుడు లక్కోజు నాగభూషణం పాల్గొన్నారు.

రాత్రి 10 తర్వాత రెస్టారెంట్లు, హోటళ్లు మూసివేయాలి: ఎస్ఐ

అరకులోయ,సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అరకులోయ టౌన్ పరిధిలో దుకాణాలు, రెస్టారెంట్లు, హోటళ్ల ప్రతీ రోజు రాత్రి పది గంటలకు మూసి వేయాలని స్థానిక ఎస్ఐ గోపాలరావు సూచించారు. బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హోటళ్లలో బసచేసేవారి నుంచి గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతంలో పనిచేయడానికి వ చ్చిన ఇతర రాష్ట్రాల వారు ఎవరైనా అద్దెకు ఉంటే వారి సమాచారం విధిగా గృహయజమానులు పోలీసులకు అందించాలని ఎస్ఐ గోపాలరావు తెలిపారు. దుకాణదారులు సిం గిల్‌యూజ్ ప్లాస్టిక్‌ని వాడకూడదన్నారు.

విశాఖ డెయిరీ నికర లాభం రూ.8.51 కోట్లు

» ప్రకటించిన చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గత ఆర్థిక సంవత్సరంలో విశాఖ డెయిరీ రూ.1,755 కోట్ల టర్నోవర్‌తో రూ.8.51 కోట్ల నికర లాభం ఆర్జించిందని డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ప్రకటించారు. షీలానగర్‌లో బుధవారం జరిగిన డెయిరీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో 19.28 కోట్ల లీటర్ల పాలు, 5.84 కోట్ల కిలోల పెరుగు విక్రయించామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ2 వేల కోట్ల టర్నోవర్ సాధించి రూ. 20 కోట్ల నికరలాభం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జీఎస్టీ తగ్గింపుతో సుమారు వందకు పైగా ఉత్పత్తుల పై ధరలు తగ్గించామన్నారు. ఈ సమావేశంలో పలువురు డైరెక్టర్‌లు, అధికారులు రైతులు పాల్గొన్నారు.


లబ్ధిదారునికి చెక్కు ఇస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

చిరు వ్యాపారులకు రుణాలు

నర్సీపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్యాలయంలో పీఎం స్వానిధి 2.0 లోక కల్యాణ్ మేళాలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు బుధవారం లోన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ ఈ పథకం కింద ఎంపిక చేసిన వ్యాపారులకు మొదటి విడత రూ. 15 వేలు, రెండో విడత రూ. 25 వేలు, మూడో విడత రూ. 50 వేలు చొప్పున రుణాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం ఏడు శాతం వడ్డీ రాయితీ ఇస్తుందన్నారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి చేతుల మీదుగా లబ్ధిదారులకు రుణాలు అందజేశారు.అలాగే డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ సుబ్రహ్మణ్యం, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ ఉదయ్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ దీపక్, మెప్మా సీవో రమాదేవి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న మాకవరపాలెం ఎంపీడీఓ సుధ

గొలుగొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా పనిచేస్తేనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ బాబూరావు అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు గ్రామాల అభివృద్ధి, ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో..

మాకవరపాలెం : మాకవరపాలెం, కోటవురట్ల మండలాలకు చెందిన ఎంపీపీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ సుధ తెలిపారు. మొదటి రోజు శిక్షణను మాకవరపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె ప్రారంభించారు. పంచాయతీల బలోపేతం, వనరుల సద్వినియోగం వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నామని ఆమె చెప్పారు.

'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్'పై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణి

గొలుగొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తమల్లంపేటలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంపై గొలుగొండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్య భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాయని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో చోద్యం సొసైటీ అధ్యక్షుడు చిటికెల సాంబమూర్తి, టీడీపీ నాయకుడు అప్పలనాయుడు, బీజేపీ నాయకుడు గాదె శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'సంపద తయారీ కేంద్రాల' పరిశీలన


చెట్టుపల్లిలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ రమాకుమారి

నర్సీపట్నం అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓఎల్ పురం, చెట్టుపల్లి గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఇన్‌చార్జి ఎంపీడీఓ రమాకుమారి బుధవారం పరిశీలించారు. కేంద్రాల పని తీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రాలను సద్వినియోగం చేసుకుని పంచాయతీల ఆదాయం పెంచుకోవాలని సూచించారు. ఆమెతో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పెద్దేరు నుంచి 250 క్యూసెక్కులు విడుదల

మాడుగుల రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయం నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరువగా ఉంది. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 137 మీటర్లు.. కాగా బుధవారం సాయంత్రానికి 558 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.35 మీటర్లకు చేరింది. ఈమేరకు రాత్రి 8 గంటలకు జలాశయం మూడో గేటు తెరిచి 250 క్యూసెక్కుల నీరు విడిచి పెడుతున్నట్టు జలాశయం ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

పోలిపిల్లమ్మకు శతమానాలు బహూకరణ

మాడుగుల రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నవర వీధిలో కొలువైన దుర్గా పోలిపిల్లమ్మ అమ్మవారికి బత్తుల గోవింద్, సౌజన్య దంపతులు శతమానాలు,పట్టు చీర బహూకరించారు. వీటిని ఆలయ నిర్వాహకుడు నల్లబిల్లి నాగరాజుకు బుధవారం వారు అందించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

శారదా నది బ్రిడ్జిపై దర్జాగా కర్రల లోడింగ్

దేవరాపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దేవరాపల్లి సమీపంలో ఉన్న శారదా నది బ్రిడ్జిపై ఓ వ్యక్తి కర్రలు లోడింగ్ చేపట్టి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించారు. ఈ బ్రిడ్జి మీదుగా అనంతగిరి మండలానికి చెందిన నాలుగు పంచాయతీలు, దేవరాపల్లి మండలానికి చెందిన రెండు పంచాయతీల ప్రజలతో పాటు దేవరాపల్లికి చెందిన కళ్లాల రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ బ్రిడ్జిపై ఓ వ్యక్తి ట్రాక్టర్ అడ్డంగా పెట్టి, పెద్ద పెద్ద చెట్ల మానులను లోడింగ్ చేశారు. రెండు గంటల పాటు లోడింగ్ జరగడంతో అటువైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.


బ్రిడ్జిపై ట్రాక్టర్ అడ్డంగా పెట్టి మానులు లోడ్ చేస్తున్న కూలీలు


ఆర్‌టీఓ కార్యాలయం నిర్వహిస్తున్న అద్దె భవనం


అధికారులు దరఖాస్తుదారులకు డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించే స్థలం

అద్దె భవనంలో ఆర్‌టీఓ కార్యాలయం

- ఏళ్ల తరబడి సొంత భవనం కరవు
- వెంటాడుతున్న స్థల సమస్య
- నెల్లిమెట్ట, టిడ్కో గృహాల వద్ద స్థలాలను తిరస్కరించిన ఆర్‌టీఓ అధికారులు
- ఇరుకు గదుల్లో విధుల నిర్వహణకు సిబ్బంది అవస్థలు

నర్సీపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయానికి సొంత భవనం లేక అద్దె కొంపలో కాలం వెల్లదీస్తోంది. ఏళ్ల తరబడి ఈ సమస్య వెంటాడుతున్నా.. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఈ కార్యాలయాన్ని బ్యాంక్ కాలనీలో ఒక పోర్షన్ అద్దెకు తీసుకొని నిర్వహిస్తున్నారు. గతంలో ఇక్కడ ఎంవీఐ కార్యాలయం ఉండేది. 2023 జూన్‌లో ప్రాంతీయ రవాణా శాఖాధికారి కార్యాలయంగా అప్‌గ్రేడ్ చేశారు. కార్యాలయం స్థాయి పెరిగినా అదే భవనంలో కొనసాగిస్తున్నారు. ఇందులో ప్రాంతీయ రవాణా శాఖాధికారి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఏవో, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. ఎంవీఐలు ఉండటానికి ప్రత్యేకంగా గది లేక హాలులో విధులు నిర్వహిస్తున్నారు. అందులోనే సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఏఎంవీఐలు పనిచేస్తున్నారు. లైసెన్స్ ఇచ్చే ముందు డ్రైవింగ్ టెస్ట్ పెట్టడానికి కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రైవేటు స్థలంలో నామ మాత్రంగా పరీక్షలు పెడుతున్నారు. కేవలం రౌండ్లు కొట్టించి, లైసెన్స్ ఇచ్చేస్తున్నారు. ఎల్ఎల్ఆర్‌లు, లైసెన్సు పని మీద వచ్చేవారు కూర్చోవడానికి హాలు ఉండాలి. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లకు ప్రత్యేకంగా గదులు ఉండాలి. అద్దె భవనంలో స్థలం సరిపోక అందరూ ఒకే చోట పని చేస్తున్నారు. దీనివల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

స్థలాలు చూపిస్తున్నా..

నర్సీపట్నం చుట్టు పక్కల భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. మునిసిపాలిటీ చుట్టూ పదిహేను కిలోమీటర్ల వరకు ఎకరా రూ. 25 లక్షలు నుంచి రూ. 30 లక్షలు వరకూ ఉంది. మునిసిపాలిటీ పరిధిలో ప్రభుత్వ స్థలం దొరకడమే గగనం అయిపోతున్నది. ఈ పరిస్థితిలో ఆర్టీవో కార్యాలయం కోసం గతంలో పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న నెల్లిమెట్ట వద్ద రెవెన్యూ అధికారులు స్థలం చూపించారు. దాన్ని ఆర్‌టీఓ అధికారులు తిరస్కరించడంతో బలిఘట్టంలోని టిడ్కో గృహాల వద్ద స్థలం చూపించారు. ఆ స్థలం బాగా దూరమైందని తిరస్కరించారు. దీంతో కార్యాలయానికి స్థలం సమకూరి సొంత భవనం నిర్మించే పరిస్థితి కనిపించడం లేదు. కార్యాలయం కోసం రెండు మూడు ఎకరాలు అవసరమని అధికారులు చెబుతున్నారు. లైసెన్స్ ఇచ్చే ముందు డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించడానికే రెండు ఎకరాలకు పైగా అవసరం ఉంటుంది. కానీ చూపించిన స్థలాలను ఆ శాఖాధికారులు తిరస్కరిస్తున్నారు. కాగా ఈ విషయమై ఆర్‌టీఓ రమేశ్‌ను వివరణ కోరగా తహశీల్దార్‌తో కలిసి టిడ్కో గృహాల వద్ద స్థలం చూశామని, ఆ స్థలం బాగా దూరమైపోతుందన్నారు.

జీవన ఎరువుల తయారీపై రైతులకు శిక్షణ


నాతవరంలో రైతులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయాధికారులు

నాతవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటల సాగులో రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం తగ్గుతుందని వ్యవసాయ పరిశోధనాధికారి, బీసీటీ శాస్త్రవేత్త డా.నాగేంద్రకుమార్ అన్నారు. బుధవారం ఎస్‌బీ పట్నం గ్రామంలో వ్యవసాయ శాఖ, ఆత్మ సంయుక్తంగా రైతులకు జీవన ఎరువుల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ఆరోగ్యాన్ని పెంపొందించడానికి రైతులు జీవన ఎరువులు వాడాలని చెప్పారు. ఏఈఓ సుగుణ మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులను విచక్షణ రహితంగా వాడడం వల్ల భూమి ఆరోగ్యంతో పాటు మనుషుల ఆరోగ్యం కూడా పాడవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకుడు కె. ఉమాప్రసాద్, సర్పంచ్ లోకవరపు సతీశ్, నర్సీపట్నం ఆత్మ బీటీఎం ఫైలా సత్యవేణి, పాల్గొన్నారు.

రావికమతంలో..

రావికమతం : రసాయన ఎరువులు అధికంగా వినియోగించడం వల్ల భూసారం తగ్గుతుందని వ్యవసాయ శాఖ నర్సీపట్నం డివిజన్ సహాయ సంచాలకురాలు శ్రీదేవి అన్నారు. దొండపూడి గ్రామంలో వ్యవసాయ శాఖ - ఆత్మ సంయుక్తంగా జీవన ఎరువుల తయారీ, వినియోగంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గుతుందన్నారు. రైతులకు జీవన ఎరువుల తయారీ, వాటిని వినియోగించే విధానంపై అవగాహన అవసరమని చెప్పారు. అనంతరం జీవన ఎరువులను ఏవిధంగా వాడాలో, ఎంత మోతాదులో వినియోగించాలో రైతులకు వివరించారు. ఆత్మ బీటీఎం ఎస్.లక్ష్మణ్ కిశోర్ మాట్లాడుతూ జీవన ఎరువులను అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో తయారు చేస్తున్నామని, అవసరమైన వారు సంప్రతించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట పీఏసీఎస్ ద్వారా మరిన్ని రుణాలు

మహాజన సభలో చైర్మన్ పీవీఎస్ఎన్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎస్ఎన్ రాజు

రావికమతం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొత్తకోట సహకార సంఘం ద్వారా రైతులకు మరిన్ని సేవలతో పాటు రుణాలు అందజేయనున్నట్టు పీఏసీఎస్ చైర్మన్ పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. బుధవారం పీఏసీఎస్ ఆవరణలో ఆయన అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 70 ఏళ్లుగా సంఘం ద్వారా సభ్య రైతులకు ఎన్నో సేవలు అందిస్తున్నామని చెప్పారు. పనితీరు బాగున్న డ్వాక్రా మహిళలను జేఎల్‌జీ గ్రూపులుగా ఏర్పాటు చేసి, వారు స్వయం ఉపాధి పొందేలా రుణాలు ఇస్తున్నామని తెలిపారు. సభ్యులు, అధికారుల సహకారంతో జిల్లాలోనే కొత్తకోట సంఘాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. కాగా సంఘం ద్వారా మంజూరు చేసే రుణాలకు రైతు షేర్ ధనం తగ్గించాలని సభ్యులు కొప్పాక నాయుడు, జంపా ఈశ్వరరావు కోరారు. పీఏసీఎస్ ద్వారా ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీ ధరలకు అందించడం అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. గత ఏడాది ధాన్యం కొనుగోలు ఆపేశారని, ఈఏడాది నుంచైనా కొనుగోలు చేయాలని కొందరు రైతులు కోరారు. అనంతరం సీఈవో జి. రఘు మాట్లాడుతూ సొసైటీ టర్నోవర్ రూ.12.79 కోట్లతో పాటు వార్షిక ఆదాయం, ఆర్థిక లావాదేవీలను వివరించారు. ఈ సభలో డైరెక్టర్లు బి. గణేశ్, ఎర్రునాయుడు, సర్పంచ్, ఉప సర్పంచ్ కోన లోవరాజు, పందల దేవ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, తదితరులు పాల్గొన్నారు.


అధ్యాపకులతో సమావేశమైన డీఐఈఓ వినోద్‌బాబు

వారాంతపు పరీక్షలు నిర్వహించాలి

అధ్యాపకులకు డీఐఈఓ సూచన

రావికమతం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తకోట జూనియర్ కళాశాలను డీఐఈఓ ఎం. వినోద్‌బాబు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులకు వెళ్లి అధ్యాపకులు విద్యార్థులకు ఏ విధంగా పాఠాలు బోధిస్తున్నది గమనించారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి, అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి నెలా వారంతపు పరీక్షలు నిర్వహించి, చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు.


ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక నాయకులు

చింతపాకలో వైద్య శిబిరం

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం లో భాగంగా చింతపాక గ్రామంలో తురకలపూడి ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబి రం నిర్వహించారు. వైద్యులు వంద మంది మహిళలకు మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్, వంటి పలు వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికా రులు సునీల్, రామలక్ష్మి, సర్పంచులు గొలజాన శ్రీను, వజ్రపు ఇందిరా శ్రీను, పంచాయతీ కార్యదర్శి సురేశ్, ఆశా తదితరులు పాల్గొన్నారు.


శాకంబరిగా జుత్తాడలో అమ్మవారు


కొత్తకోటలో దుర్గమ్మ


అప్పలరాజుపురంలో కుంకుమ పూజలు


అన్నపూర్ణాదేవి అలంకరణలో దుర్గమ్మ

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

రావికమతం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొత్తకోట దుర్గాదేవి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని బుధవారం అన్నపూర్ణదేవిగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వేపా రామకృష్ణ కిశోర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు.

నర్సీపట్నం : దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు చేసి, మధ్యాహ్నం అన్న ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జంపన నాగేంద్రరాజు. సభ్యులు పాల్గొన్నారు.

లలితాదేవి ఆలయంలో...

చీడికాడ : అప్పలరాజుపురం దేవిమెట్టపై వెలసిన లలితాదేవి ఆలయంలో బుధవారం కుంకుమ పూజ నిర్వహించారు. అర్చకుడు కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ చుక్క అప్పలనాయుడు దంపతులు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

చోడవరం : జుత్తాడలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలోని భవానీ భక్తులు అమ్మవారిని శాకంబరీగా అలంకరించి వీధుల్లో ఊరేగించారు. ఇక్కడ ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు.


వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

తాగునీటి సమస్యపై ఫిర్యాదు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలంలోని లింగంపేట పంచాయతీ రామచంద్రపురంలో తాగునీటి సమస్యపై జనసేన నాయకులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు బుధవారం వారు మంగళగిరిలో జరిగిన మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. లింగంపేట పంచాయతీలో రూ. 12 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు నిర్మించి 60 గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నారని, అదే పంచాయతీలో ఉన్న తమ గ్రామానికి మాత్రం ట్యాంకు నిర్మించి తాగునీరు సరఫరా చేయాలని కోరుతున్నా.. పట్టించుకోవడం లేదన్నారు. సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కోనా తాతారావు, గ్రామ ఉప సర్పంచ్, గొలుగొండ జనసేన మండల ఉపాధ్యక్షుడు లంక సత్యనారాయణ, అప్పన్న, దొరబాబు, బోయిన మురళి, పోతల గణేశ్, గొంప కృష్ణ పాల్గొన్నారు.

మంత్రులు నాదెండ్ల, దుర్గేశ్‌లను కలిసిన జనసేన నాయకులు


మంత్రులు మనోహర్, దుర్గేశ్‌తో జనసేన నాయకులు

నర్సీపట్నం అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్‌ను నర్సీపట్నం జనసేన నాయకులు అప్పన్న, ఎస్ఎస్‌జీ దొరబాబు అమరావతిలోని జనసేన కార్యాలయంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా దొరబాబు నియోజకవర్గంలో చేపడుతున్న పార్టీ కార్యక్రమాల గురించి మంత్రులకు వివరించారు. అలాగే నియోజకవర్గంలో పర్యటించాలని కోరారు. వారితో పాటు బైన మురళి, పోతుల గణేశ్, సత్యనారాయణ, కృష్ణకుమార్ యాదవ్ ఉన్నారు.

విజయవాడకు కాలినడకన భవానీ భక్తులు


గ్రామం నుంచి కాలినడకన బయలుదేరిన భవానీ భక్తులు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం లింగంపేట గ్రామానికి చెందిన ఎనిమిది మంది భవానీ భక్తులు విజయవాడ కనక దుర్గమ్మ దర్శనానికి బుధవారం కాలినడకన బయలుదేరారు. గ్రామానికి చెందిన అంబటి ప్రసాద్, నాయుడు, నరసింగరావు, గణేశ్, తాతాజీ, సత్తిబాబు, స్వామినాయుడు, తదితరులు అమ్మవారి దర్శనానికి వెళ్లిన వారిలో ఉన్నారు.

నేడు రాచపల్లిలో రెవెన్యూ గ్రామ సభ

మాకవరపాలెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాచపల్లి గ్రామంలో సర్వే నంబరు 737లో ఉన్న కొండపోరంబోకు భూమిలో ఆక్రమణదారులను గుర్తించామని, ఈమేరకు సచివాలయంలో గురువారం గ్రామసభ నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ జి. వెంకటరమణ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 406 ఎకరాలను 469 మంది రైతులు ఆక్రమించినట్టు గుర్తించామని, ఈ సభకు రైతులందరూ హాజరుకావాలని కోరారు.

12వ పీఆర్‌సీ అమలు చేయాలి : సీటూ

నర్సీపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 12వ పీఆర్‌సీని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘం నాయకులు, కార్యకర్తలు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 12వ పీఆర్‌సీని ప్రకటించి ఉద్యోగుల జీతాలు పెంచాలని,డీఏ, సరెండర్ లీవ్‌ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే మునిసిపల్ కార్మికుల 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, 13 గంటల పని దినాలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం. లోవరాజు, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

160 మందికి వైద్య పరీక్షలు


రోగితో మాట్లాడుతున్న డా. హర్ష

చీడికాడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా తునివలస పంచాయతీ కార్యాలయంలో బీజేపీ నాయకులు బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖకు చెందిన మెడీకవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బీజేపీ మండల అధ్యక్షుడు పి. బాలకృష్ణ ఆర్థిక సహాయంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యులు 160 మంది రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరువూరి శివాజీ రాజు, క్యాంపు కో-ఆర్డినేటర్ అభిరామ్, తదితరులు పాల్గొన్నారు.

అగ్రి సెట్‌లో బీఆర్ విద్యార్థులకు ర్యాంకులు

నర్సీపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అగ్రి సెట్ ఫలితాల్లో బీఆర్ పాలిటెక్నిక్ వ్యవసాయ విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఈ పరీక్షలో విత్తన సాంకేతిక టెక్నాలజీ విభాగంలో ఎస్. రాజేశ్ 105 మార్కులతో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించగా బి. బిందుశ్రీ 7, వాలమ్ శ్రావణి 8, జి. సాయికుమార్ 15, జి. నాగలక్ష్మి 18వ ర్యాంక్ పొందారు. వ్యవసాయ డిప్లొమా విభాగంలో ఇ. భానుప్రకాశ్ 105 మార్కులో రాష్ట్రస్థాయిలో 94వ ర్యాంక్, ఎస్. రాజేశ్ హర్షవర్ధన్ 109, బి. జాన్సీదేవి 131, ఎస్. యోగేంద్రనాయుడు 133, జి. వెంకటనవీన్ 140వ ర్యాంక్ సాధించారని కళాశాల ప్రతినిధులు పి. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఎం. మానయ్య తెలిపారు.

అగ్రహారం దారి అధ్వానం


గోతులతో అధ్వానంగా ఉన్న అగ్రహారం రోడ్డు

ఆరు కిలోమీటర్ల మేర గోతులు

- భారీ వాహనాల రాకపోకలతో మరింత ఛిద్రం
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- పట్టించుకోని అధికారులు


మాకవరం జంక్షన్ వద్ద ఇలా..

తుమ్మపాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని అగ్రహారం రహదారి అధ్వానంగా తయారైంది. అడుగుకో గొయ్యి.. గజానికో గుంత ఏర్పడి దారుణంగా ఉంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గం ఇలా ఉండడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించు కోవడం లేదని వాహనచోదకులు వాపోతున్నారు.

అనకాపల్లి మండలంలోని చింతనిప్పుల అగ్రహారం నుంచి తుమ్మపాలకు చేరుకునే రోడ్డు దాదాపు ఆరు కిలోమీటర్ల మేర భారీగా గోతులు ఏర్పడి ప్రమాద కరంగా ఉంది. అగ్రహారం రహదారిలో నిత్యం మాకవరం, మార్టూరు, పాపయ్య పాలెం, సంతపాలెం, కొండు పాలెంతో పాటు అగ్రహారం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తుమ్మపాల మీదుగా అనకాపల్లికి రాకపోకలు సాగిస్తుంటారు.


మార్టూరు వద్ద రోడ్డు దుస్థితి

అలాగే ఈ గ్రామాల నుంచి చోడవరం వైపు ప్రయాణించే వారికి సైతం ఈ రోడ్డే దిక్కు. అయితే ఈ రోడ్డులో భారీ గోతులు ఏర్పడడంతో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డు రూపు పూర్తిగా మారిపోయింది. రాత్రి వేళల్లో ఈ మార్గంలో విద్యుద్దీపాలు లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రోడ్డును ఆనుకొని పలు వ్యాపార సముదాయాలు, కర్మాగారాలు, పొలాలు ఉండడంతో నిత్యం కూలీలు, కార్మికులు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల సైతం ఈ రోడ్డులో ప్రయాణిస్తుంటారు. ఈ గ్రామాల సమీపాల్లో పెద్ద సంఖ్యలో క్వారీ, క్రషర్లు ఉండడంతో నిత్యం భారీ లోడులతో లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఈ రోడ్డు మరింత ఛిద్రమైంది. గోతులమయమైన ఈ రోడ్డులో భారీ లోడులతో ఎదురుగా వచ్చే లారీలను తప్పించే క్రమంలో పలువురు వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికా రులు స్పందించి వెంటనే ఈ రహదారికి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

పొలానికి వెళ్లాలంటే దడ



నేను మార్టూరులో ఉంటున్నాను. మాకు అగ్రహారంలో పొలం ఉంది. రోజూ వ్యవసాయ పనుల మీద ఈ రోడ్డులో పొలానికి వెళ్లి వస్తుంటాను. ఈ రోడ్డులో భారీ గోతులు ఏర్పడడంతో చాలా సార్లు ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తూ ప్రమాదానికి గురైన సందర్భాలు ఉన్నాయి. దీంతో ఇటుగా ప్రయాణమంటే దడగా ఉంది. అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలి. - జగ్గరాజు, మార్టూరు

భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలి



అగ్రహారం నుంచి తుమ్మపాలకు వెళ్లే రహదారిలో భారీ వాహనాల రాక పోకలను నియంత్రించాలి. భారీ వాహనాల వలన రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డును ఆనుకొని ఉన్న పలు గ్రామాల్లో క్వారీ, క్రషర్లు ఉన్నాయి. భారీ లోడుతో వెళ్లే లారీల వలన రోడ్డు గోతులమ యమవుతున్నా క్వారీ, క్రషర్ల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. కనీసం గోతులు కూడా పూడ్చడం లేదు. - బద్ది సోమునాయుడు, మార్టూరు

ఈవీఎంల గోదాము తనిఖీ


పాడేరులో ఈవీఎంల గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్

పాడేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న ఈవీఎంల గోదామును కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎంల గోదాము పరిసరాల్లో ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను పరిశీలించి, కట్టుదిట్టమైన భద్రతను ఇలానే కొనసాగించాలన్నారు. అలాగే ఈవీఎంను భద్రపరిచిన పెట్టెలను, గోదాముకు వేసిన సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, తహశీల్దార్ అరుణ్‌చంద్ర, డిప్యూటీ తహశీల్దార్లు లక్ష్మణమూర్తి, మత్స్యరాజు, సోమేశ్వరరావు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీని త్వరగా పూర్తి చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్


పాడేరులోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పాడేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ మెడికల్ కాలేజీని త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. అరణ్య గర్జన యాత్రలో భాగంగా బుధవారం మండలంలో మినుములూరు, గుర్రగరువు గ్రామాల పర్యాటన అనంతరం స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించారు. మెడికల్ కాలేజీ నిర్మాణానికి సంబంధించిన మొత్తం నిధుల్లో కేవలం 30 శాతం మాత్రమే విడుదల కావడంతో పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొత్తం నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మొత్తం రూ.500 కోట్లకు గాను ఇప్పటికి కేవలం రూ.170 కోట్లు మాత్రమే విడుదల చేయడంతో పనులు పూర్తికాక 150 సీట్ల భర్తీ ప్రక్రియ కేవలం 50 సీట్లకు పరిమితమైందన్నారు. గిరిజన ప్రాంత అవసరాలు, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మెడికల్ కాలేజీకి నిర్మాణానికి సంబంధించిన నిధులను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు కొర్రా త్రినాధ్, ధర్మన్నపడాల్, వరహాలు, సింహాద్రి, దాస్, హైమావతి, కృష్ణారావు, బొజ్జన్న, చిన్నారావు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వెంకన్న ధ్వజారోహణం


పల్లకీలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు


ధ్వజారోహణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

నక్కపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం ఆలయ ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. ముందుగా గరుడాద్రి పర్వతంపై వున్న స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, నిత్య అర్చనలు చేశారు. కొండ దిగువన వున్న ఆలయంలో నిత్య కార్యక్రమాలు, విశేష హోమాలు, బేరి పూజ చేశారు. అనంతరం పెద్దపల్లకీలో ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని అలంకరించి ఆలయ ప్రాకారం, మాడవీధుల్లో అష్టదిక్పాలకులను ఆహ్వానించి, బలిహరణలు చేసి, తిరువీధి సేవ నిర్వహించారు. తదుపరి ఆలయ ఆచార, వ్యవహారాల మేరకు ధ్వజారోహణ కార్యక్రమాన్ని భక్తుల సమక్షంలో నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి, గరుడ పొంగలిని నైవేద్యంగా సమర్పించారు. ఆ తరువాత గోదాదేవి అమ్మవారి సన్నిధిలో లక్ష్మీ సహస్రనామ కుంకుమార్చనలు చేశారు. ఆలయంలో ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు తదితరులు నాలాయిర సేవాకాలం చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ మత్స్యకారుల ఆందోళన


రోడ్డుపై బైఠాయించిన మత్స్యకారులు


పోలీసులు, మత్స్యకారుల మధ్య వాగ్వాదం

నక్కపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా రాజయ్యపేట కేంద్రంగా జరుగుతున్న ఆందోళనను మత్స్యకారులు తీవ్రతరం చేశారు. బుధవారం సాయంత్రం పెద్దఎత్తున మత్స్యకారులు కదలివచ్చి రాజయ్యపేట ప్రధాన రహదారిపై బైఠాయించారు. రహదారికి అడ్డంగా తాటికమ్మలు వేసి మంట పెట్టారు. నిరసన శిబిరంలో టెంట్లు తొలగించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్న తరుణంలో పోలీసులు, మత్స్యకారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రాజయ్యపేట గ్రామం, సముద్రం నుంచి తమను వేరు చేసే బల్క్‌డ్రగ్ పరిశ్రమను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై ధర్నా చేశారు. రాత్రి 7.30 గంటల వరకు ధర్నా కొనసాగించారు.

నవజాత శిశువుల ఆరోగ్య సమస్యలపై అవగాహన అవసరం

- ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలత


మాట్లాడుతున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతదేవి

పాడేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువుల ఆరోగ్య సమస్యలపై వైద్యులు, సిబ్బంది సంపూర్ణ అవగాహన ఏర్పరచుకోవాలని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్(ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్) డాక్టర్ డి.హేమలతదేవి సూచించారు. నవజాత శిశువుల ఆరోగ్య, నేత్ర సమస్యల గుర్తింపుపై స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది తొలుత నవజాత శిశువులకు సంక్రమించే అనారోగ్య సమస్యలు, అలాగే నేత్ర సమస్యలపై అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా నవజాత శిశువులకు సంబంధించిన సమస్యలపై హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ స్వప్న, ఫెర్నాండేజ్ ఆస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ తేజోప్రతాప్, ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రి నిపుణులు డాక్టర్ సుభద్ర, తదితరులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రిలోని వివిధ విభాగాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వా రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

- జిల్లా మత్స్య శాఖ అధికారి విజయ


ఆక్వా రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మత్స్య శాఖ అధికారి విజయ

దేవరాపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆక్వా రైతులంతా విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా మత్స్య శాఖ అధికారి జి.విజయ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆక్వా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 1,862 చేపలు, రొయ్యల చెరువులు 2,846 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నాయని, వీటిలో 1,443 చెరువులకు అనుమతులు మంజూరయ్యాయన్నారు. ఆక్వా రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, నిరభ్యంతర పత్రం, ఆధార్ జెరాక్స్ కాపీ, పంచాయతీ తీర్మానం కాపీని సమర్పించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. చేపలు, రొయ్యల చెరువుల్లో నిషేధిత ఆహార పదార్థాలు వేసినా, పర్యావరణానికి హాని కలిగించే విధంగా చెరువులు నిర్వహించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

క్రైం... crime news

తాచేరులో గల్లంతైన విద్యార్థి మృతి


ఆడారి రోహిత్ మృతదేహంతో ఎన్డీఆర్ఎఫ్ బృందం. (ఇన్‌సెట్‌లో) రోహిత్ (ఫైల్ ఫొటో)

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని విజయ రామరాజుపేట వద్ద తాచేరు గెడ్డలో మంగళవారం గల్లంతైన విద్యార్థి, బుధవారం శవమై తేలాడు. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. విజయరామరాజుపేటకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి ఆడారి రోహిత్ (13) మంగళవారం ఉదయం తమ్ముడు లోహిత్‌తో కలిసి గ్రామానికి సమీపంలో వున్న తాచేరు గెడ్డ కాజ్‌వే వద్దకు వెళ్లాడు. నీటిలో చెప్పు పడిపోవడంతో దానిని తీసుకునే క్రమంలో నీటిలో దిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. అగ్నిమాపక సిబ్బందిని, గజ ఈతగాళ్లను రప్పించి, గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. బుధవారం ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. వడ్డాది గాయత్రి కళాశాల ఎదురుగా పెద్దేరు నది తీరంలోని తుప్పల్లో రోహిత్ మృతదేహం కనిపించింది. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి తల్లిదండ్రులకు అప్పగించినట్టు ఎస్ఐ శ్రీనివాసరావు చెప్పారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

సీలేరు, సెప్టెంబరు 24, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో ఆదివారం అర్ధరాత్రి యువకుడిని హత్య చేసి కేసులో నిందితుడిని అరెస్టు చేసి, విశాఖపట్నం జువెనైల్ హోంకు తరలించినట్టు సీఐ వరప్రసాద్ తెలిపారు. బుధవారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. సీలేరు పంచాయతీ చింతపల్లి క్యాంపునకు చెందిన ఒక బాలుడు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి లేకపోవడంతో చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. జల్సాల కోసం ఇదే ప్రాంతంలో నివాసం వుంటున్న వంతల భగత్‌రామ్(32) ద్విచక్ర వాహనాన్ని చోరీ చేశాడు. దీని గురించి అడగ్గా.. తాను చోరీ చేయలేదని చెప్పాడు. దీంతో భగత్‌రామ్ తన ద్విచక్ర వాహనం చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేసి, అందులో సదరు మైనర్ విద్యార్థి పేరును ప్రస్తావించాడు. ఈ విషయం తెలుసుకున్న మైనర్ విద్యార్థి కక్ష పెంచుకుని ఆదివారం రాత్రి భగత్‌రామ్‌కు ఫోన్ చేసి, సీలేరు రిజర్వాయర్ వద్దకు వస్తే బైక్ ఇస్తానని చెప్పాడు. దీంతో భగత్‌రామ్ అక్కడకు వెళ్లగా, మైనర్ విద్యార్థి బీరు సీసాతో తలపై బలంగా కొట్టి, అనంతరం శరీరంపై పలుచోట్ల పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో భగత్‌సింగ్ అక్కడికక్కడే మృతిచెందాడు. నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడిని పట్టుకోవడానికి రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక పోలీసు బృందం అతని ఇంటికి సమీపంలో నిఘా వేసింది. బుధవారం ఉదయం నిందితుడు ఇంటికి వస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. భగత్‌రామ్‌కు చెందిన బైక్‌ను తానే చోరీ చేసినట్టు ఒప్పుకున్నాడు. నిందితుడు మైనర్ కావడంతో విశాఖలోని జువెనైల్ హోంకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మునగపాక మండలం తోటాడ సమీపంలోని మూలపేటకు చెందిన రిటైర్డు ఉద్యోగి యల్లపు సూరిఅప్పారావు(64) బుధవారం ఉదయం రైల్వే స్టేషన్ నుంచి స్వగ్రామం మూలపేటకు ఆటోలో వెళుతున్నారు. నూకాంబిక ఆలయ ముఖద్వారం దాటిన తరువాత విశాఖ నుంచి కశింకోట వైపు వెళ్లే వ్యాన్ ఆ ఆటోను వెనుక నుంచి ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న సూరిఅప్పారావు తీవ్రంగా గాయపడ్డారు. ఆయనకు ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స చేసి విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్టు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శేఖరం తెలిపారు.

ఎలమంచిలి ఎంపీపీపై అవిశ్వాసం

... 7వ పేజీ తరువాయి

ఆశించారు. కానీ నాడు స్థానిక ఎమ్మెల్యే ఎంపిక మేరకు గోవిందరావుకు ఎంపీపీ పదవి దక్కింది. ఇదిలావుండగా వైస్ ఎంపీపీలు రాజాన శేషు, ఎస్.ఉమ గత ఏడాది జనసేన పార్టీలో చేరారు. ఎంపీపీని పదవి నుంచి దించేయాలంటే మొత్తం సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది నోటీసుపై సంతకాలు చేయాలి. మండలంలో ఏడుగురు ఎంపీటీసీ సభ్యులకుగాను ఒకరు మృతిచెందడంతో ప్రస్తుతం ఆరుగురు వున్నారు. అవిశ్వాస నోటీసుపై సంతకాలు చేయడానికి నలుగురు సభ్యులు వుండాలి. ఈ మేరకు రాజాన శేషు, శిలపరశెట్టి ఉమ, నగిరెడ్డి అమ్మాజీ, బర్రే శివలక్ష్మి అవిశ్వాస నోటీసుపై సంతకాలు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ఎంపీడీవో త్వరలో మండల పరిషత్ సమావేశాన్ని ఏర్పాటు చేసి, అవిశాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తారు.

ప్రయాణం దూరాభారం

... 7వ పేజీ తరువాయి


చోడవరం పట్టణంలో ఇరుకుగా వున్న చీడికాడ రోడ్డులో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు

మండలానికి చెందిన ప్రయాణికులు ఎక్కేవారు. ఒకవేళ బస్సు లేకపోయినా ఆటోల్లో వెళ్లేవారు. కానీ విజయరామరాజుపేటతోపాటు వడ్డాది వద్ద కాజ్‌వేలు దెబ్బతినడంతో ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులు తగ్గించారు. దీంతో బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఆటోలకు అదనంగా డబ్బులు చెల్లించి గౌరీపట్నం, వడ్డాది మీదుగా లేదంటే చీడికాడ మండలం మీదుగా మాడుగులకు రాకపోకలు సాగిస్తున్నారు. అధికార యంత్రాంగం వెంటనే స్పందించి విజయరామరాజుపేట, వడ్డాది కాజ్‌వేల పునరుద్ధరణ పనులు చేపట్టాలని పలు మండలాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇంజనీరింగ్ సీట్లు... విద్యార్థుల పాట్లు

... 7వ పేజీ తరువాయి

కాలేజీల్లో, నచ్చిన బ్రాంచీల్లో సీట్లు దక్కించుకున్నారు.అయితే అప్పటికే మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో చేరేందుకు సిద్ధమైన విద్యార్థులకు కొత్త చిక్కు వచ్చిపడింది. కన్వీనర్ కోటాలో సీట్లు రాలేదన్న ఉద్దేశంతో మేనేజ్‌మెంట్ కోటాలో చేరే క్రమంలో ఎంతోమంది ఆయా కాలేజీలకు కొంత మొత్తం ఫీజును అడ్వాన్స్‌గా చెల్లించడంతోపాటు సర్టిఫికెట్లను ఇచ్చేశారు. ఇప్పుడు కన్వీనర్ కోటాలో సీట్లు వచ్చాయని చెప్పి ఆయా కాలేజీలకు వెళ్లి సర్టిఫికెట్లు అడుగుతుంటే ఇచ్చేందుకు యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయి. మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో చేరి, ఇప్పుడు వేరొకచోట సీటు వచ్చిందని వెళ్లిపోతే తాము నష్టపోతామని వాదిస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కాలేజీల యాజమాన్యాలపై అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. కన్వీనర్ కోటాలో సీట్లు దక్కించుకున్నా వేలాది రూపా యలు చెల్లించాల్సి రావడంతో ఇటు విద్యార్థులు, మేనేజ్‌మెంట్ కోటాలో చేరిన విద్యార్థులకు కన్వీనర్ కోటాలో సీట్లు వచ్చి వెళ్లిపోయే పరిస్థితి రావడంతో అటు యాజమాన్యాలు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, సర్టిఫికెట్లు ఇవ్వ కుండా ఇబ్బంది పెట్టకూడదని, ఫిర్యాదులు వస్తే మాత్రం చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534